అనర్హులకు అందలం

- ఇబ్బడి ముబ్బడిగా ఉద్యోగులకు జారీ
- నిబంధనలకు నీళ్లు
- చర్యలకు వెనకడుగు
- ఫిర్యాదులపై నామమాత్రపు చర్యలు
- జిల్లా వ్యాప్తంగా వేల సంఖ్యలో ఉపాధి జాబ్‌కార్డులు



గ్రామీణ ప్రాంతాల్లో వలసలు నివారించేందుకు కేంద్రం ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పక్కదారి పడుతోంది. జిల్లాలో కొందరు అనర్హులు ఉపాధి జాబ్‌కార్డులు పొంది పనులకు వెళ్లకుండానే మస్టర్లు వేయించుకుని లబ్ధి పొందుతున్నారు. ప్రధానంగా వీరపునాయునిపల్లె, వల్లూరు, ఎర్రగుంట్ల, ప్రొద్దుటూరు, పులివెందుల తదితర మండలాల్లో నివాసం ఉంటూ ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్న వారు సైతం కార్డులు పొంది ప్రభుత్వ లక్ష్యాన్ని నీరుగారుస్తున్నారు. వీరిపై ఫిర్యాదులొచ్చినా నామమాత్రపు చర్యలతో అధికారులు సరిపెడుతుండడంతో వారు ఆడిందే ఆట.. పాడిందే పాటగా తయారైంది.

కడప ఎన్టీఆర్‌సర్కిల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో కుటుంబానికి వంద రోజులు తక్కువ కాకుండా నైపుణ్యం అవసరం లేని ఉపాధిని కల్పించడంతో పాటు సుస్థిరమైన ఆస్తులను సృష్టించేందుకు మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ప్రవేశపెట్టారు. ఇందుకోసం జిల్లాలోని 35 మండలాల్లో ఉన్న గ్రామీణ ప్రాంతాల్లో 2,26,753 జాబ్‌కార్డులను మంజూరు చేయగా, వీటిలో 1,93,340 జాబ్‌కార్డులు యాక్టివ్‌గా ఉన్నాయి. వీటి ద్వారా మూడు లక్షలా 5 వేల మందికి పనులు కల్పించారు. ఈ పథకం కింద ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు నిర్దేశించిన 45 లక్షల పనిదినాలకు గానూ 59.90 లక్షల పనిదినాలు కల్పించినట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. జాబ్‌కార్డులు జారీ చేస్తున్న సమయంలో సిబ్బంది అనేక రకాల జాగ్రత్తలు తీసుకుంటున్నప్పటికీ కొంతమంది తమ రాజకీయ పలుకుబడిని ఉపయోగించి తమ కుటుంబీకుల పేర్లతో ఉపాధి కార్డులు పొందుతున్నట్లు తెలుస్తుంది. వారు పనులకు వెళ్లకుండానే మస్టర్లు వేయించుకున్నట్లు సమాచారం.

ఉద్యోగులకు ఉపాధి కార్డులు

వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగుల కుటుంబ సభ్యులతో పాటు, అవుట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న ఉద్యోగులకు కూడా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కార్డులు ఉన్నట్లు తెలుస్తోంది. ప్రధానంగా వీరపునాయునిపల్లె, వల్లూరు, ఎర్రగుంట్ల, ప్రొద్దుటూరు, పులివెందుల తదితర మండలాల్లో నివాసం ఉంటున్న వారు ఒక పక్క ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తూ మరో పక్కన ఉపాధిహామీ కార్డులు పొందడం ద్వారా ప్రభుత్వ ఉద్దేశ్యాన్ని నీరుగారుస్తున్నట్లు తెలుస్తోంది. మండల కేంద్రమైన వల్లూరులో కొంతమంది రిమ్స్ ఆసుపత్రిలో ఔట్‌సోర్సింగ్ విధానం కింద పనిచేస్తున్నప్పటికీ వారి పేర్లతో పాటు కుటుంబ సభ్యుల పేర్లతో జాబ్‌కార్డులు ఉన్నట్లు సమాచారం. అదే విధంగా ఎర్రగుంట్ల, ప్రొద్దుటూరు పరిధిలో ఉన్న కొంతమంది ఆర్టీపీపీలో ఉద్యోగాలు చేసే వారు కూడా జాబ్‌కార్డులు పొందినట్లు సమాచారం. ఇక వీరపునాయునిపల్లె మండలంలో సహకారశాఖ పరిధిలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీలో పనిచేస్తున్న గోనుమాకులపల్లె సొసైటీ సీఈవో దేశాయిరెడ్డి భార్య పద్మతులసి పేరుతో అలిదెన గ్రామ పంచాయతీలో జాబ్‌కార్డు కలిగి ఉండి 47 రోజులు పనికి వెళ్లినట్లు సమాచారం. అదే విధంగా నల్లింగాయపల్లె ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీలో క్లర్కుగా పనిచేస్తున్న ఈశ్వర్‌రెడ్డి అనే వ్యక్తి భార్య ఎస్.లక్ష్మీదేవి పేరుతో తలపనూరు పంచాయతీలో జాబ్‌కార్డు కలిగి ఏడాది 62 రోజులు పాటు పనికల్పించినట్లు సమాచారం. అయితే వీరెవరు పనులకు వెళ్లలేదని, అయినప్పటికీ జాబ్‌కార్డుల ద్వారా ప్రయోజనం పొందినట్లు స్పష్టమవుతోంది. జిల్లా వ్యాప్తంగా ఇలాంటి అనర్హులు వేల సంఖ్యలో ఉన్నట్లు సమాచారం. అధికార యంత్రాంగం సమగ్రంగా జాబ్‌కార్డులను పరిశీలన చేస్తే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశాలు లేకపోలేదు.

ఫిర్యాదుపై చర్యలకు వెనకడుగు

అనర్హులు జాబ్‌కార్డులను పొంది పనులకు వెళ్లకున్నా.. వెళ్లినట్లు లబ్ధి పొందడంపై డ్వామా అధికార యంత్రాంగానికి ఫిర్యాదులు అందాయి. అయితే విచారణ చేపట్టిన అధికారులు ఆ జాబ్‌కార్డులను రద్దు చేసినట్లు తెలుస్తోంది. ఎలాంటి చర్యలు తీసుకోకుండా కేవలం కార్డులను మాత్రమే రద్దు చేయడంపై ఫిర్యాదు చేసిన వ్యక్తి న్యాయ పోరాటానికి సిద్ధపడుతున్నట్లు సమాచారం. ఒక్క వీరపునాయునిపల్లెలోనే కాకుండా జిల్లా వ్యాప్తంగా ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు ఉపాధి హామీ కార్డులు పొంది పనులకు వెళ్లకుండానే వెళ్లినట్లు రికార్డుల్లో చూపించుకుంటూ ప్రయోజనం పొందుతున్నారని దీని ద్వారా ప్రజాధనం దుర్వినియోగమవుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతుంది.


న్యాయం కోసం పోరాటం



ప్రభుత్వ ఉద్యోగస్తులకు, కుటుంబ సభ్యులకు ఉపాధి హామీ పథకం జాబ్‌కార్డులు ఇచ్చి ప్రభుత్వం పేదల కోసం అమలు చేస్తున్న ఒక మంచి పనిని దుర్వినియోగం చేయడం దురదృష్టకరం. అక్రమాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు నామమాత్రపు చర్యలు తీసుకుని చేతులు దులుపుకుంటున్నారు. ఈ విషయంపై న్యాయ పోరాటం చేసేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నాం.

- పీవీ వెంకట నాగప్రసాద్, వీఎన్‌పల్లె

జాబ్‌కార్డులు ఎవరికైనా ఇవ్వవచ్చు



జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంలో 18 ఏళ్లు నిండి, పనిచేస్తామనే ప్రతి ఒక్కరికీ జాబ్‌కార్డు ఇవ్వవచ్చనే నిబంధన ఉంది. అయితే గత ప్రభుత్వ హయాంలో రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్టు ఉద్యోగులు, వలంటీర్లు కూడా ఉపాధి హామీకార్డు పొందవచ్చని ఒక సర్క్యులర్ ఇచ్చింది. అయితే విధులు నిర్వహించే సమయంలో ఉపాధి హామీ పనులు చేయకూడదనే నిబంధన జారీ చేసింది. అయినప్పటికీ ఉద్యోగస్తులు, వారి కుటుంబ సభ్యులకు జాబ్‌కార్డు ఇవ్వవచ్చా అన్న విషయంపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతాం.

- ఆదిశేషారెడ్డి, పీడీ, డ్వామా

శాస్త్రోక్తంగా అంకురార్పణ



అంకురార్పణ కార్యక్రమ దృశ్యం

కడప కల్చరల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): తిరుమల తొలిగడపగా ఖ్యాతిగాంచిన దేవుని కడప లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం శాస్త్రోక్తంగా బాలాలయం సంప్రోక్షణకు అంకురార్పణ కార్యక్రమం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆ మేరకు సాయంత్రం 5-30 గంటలకు ఆలయంలో ఏర్పాటు చేసిన యాగశాలలో బాల బింబిలాలకు జలాభిషేకం గావించారు. 19న మంగళవారం ఉదయం 8 గంటలకు యాగశాలలో వైదిక కార్యక్రమాలు, శాంతి హోమం, వాస్తుహోమం నిర్వహించారు. అదే రోజు సాయంత్రం కళాకర్షణలో భాగంగా గర్భాలయంలోని లక్ష్మీ వేంకటేశ్వరస్వామి వారి మూలమూర్తి ఆరాధనలు చేపట్టనున్నారు. 20న ఉదయం 9-30 గంటలకు మహాపూర్ణాహుతి, ఉదయం 10 నుంచి 11-15 గంటల మధ్య తులాలగ్నంలో బాలబింబ ప్రతిష్ఠ, బాలాలయ సంప్రోక్షణ నిర్వహించనున్నట్లు ఆలయ డిప్యూటీ ఈవో ప్రశాంతి, సూపరింటెండెంట్ హనుమంతయ్య, ఇన్‌స్పెక్టర్ పి.ఈశ్వర్‌రెడ్డి, అర్చకులు పాల్గొన్నారు.

ఎన్నికల కమిషన్ క్షమాపణ చెప్పాలి

- రాజ్యసభ మాజీ సభ్యుడు తులసిరెడ్డి

కడప కలెక్టరేట్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ఓటర్ల జాబితాలో అవకతవకలకు గానూ దేశ ప్రజలకు ఎన్నికల కమిషన్ క్షమాపణ చెప్పాలని రాజ్యసభ మాజీ సభ్యుడు తులసిరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం నగరంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల కమిషన్ అంపైర్‌లా కాకుండా బీజేపీ టీమ్ ప్లేయర్‌గా వ్యవహరించడం గర్హనీయమన్నారు. ప్రజాస్వామ్యానికి ఎన్నికలు ప్రాణ వాయువు అని, అటువంటి ఎన్నికలకు సంబంధించి సక్రమమైన ఓటర్ల జాబితా ప్రామాణికంగా ఉండాలని తెలిపారు. అర్హులకు ఓటు లేకుండా చేసి పెద్దఎత్తున అనర్హులకు ఓటుహక్కు కల్పించడం పరిపాటిగా మారిందని విమర్శించారు. ఈ అంశాన్ని ప్రస్తావించినందుకు లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీని ఎన్నికల కమిషన్ తప్పుపడుతూ దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని కోరడం విడ్డూరంగా ఉందన్నారు. కేంద్ర మంత్రి అనురాగ్‌ఠాకూర్ కూడా ఓటర్ల జాబితాలో అవకతవకలు ఉన్నాయని చెప్పారని, ఆయన కూడా క్షమాపణ చెప్పాలా అని ప్రశ్నించారు. కమిటీలో పీఎం, లోక్‌సభ ప్రతిపక్ష నేతతో పాటు న్యాయమూర్తి ఉండాలన్నారు. న్యాయమూర్తి స్థానంలో కేంద్ర మంత్రి ఉండడం వల్లే ఓటర్ల జాబితాలన్నీ గోల్‌మాల్ చేశారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు ప్రసాద్‌గౌడ్, సుధాకర్, ఉత్తన్న, భాస్కర్, విజయభాస్కర్, సుబ్బారెడ్డి, తదితరులున్నారు.

విద్యుదాఘాతంతో కౌలురైతు మృతి



విద్యుత్‌షాక్‌తో మృతిచెందిన కౌలు రైతు పవన్‌కుమార్

మైదుకూరురూరల్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): విద్యుత్ షాక్‌తో కౌలురైతు మృతి చెందిన విషాదకర సంఘటన మైదుకూరులో చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు వివరాలిలా.. చాగలమర్రి మండలం బాచుపల్లి గ్రామానికి చెందిన పవన్‌కుమార్ (35) రెండేళ్ల క్రితం తన కుటుంబంతో కలిసి మైదుకూరుకు వచ్చి శీలంనగర్‌లో నివాసం ఉంటున్నాడు. ఎర్రచెరువు సమీపంలో భూమిరెడ్డి క్రిష్ణయ్యకు చెందిన పది ఎకరాల పొలం కౌలుకు తీసుకొని జీవనం సాగిస్తున్నాడు. అయితే సోమవారం ఉదయం పొలంలో ట్రాక్టర్‌తో దున్నుతుండగా, పొలానికి నీరు అవసరం వచ్చి బోరు వేయడానికి స్టార్టర్ ఆన్ చేయబోయాడు. స్టార్టర్ పట్టుకొగానే విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా ఇంటి యజమాని మృతితో కుటుంబ సభ్యులు లబోదిబోమంటున్నారు. ఉదయం టిఫెన్ ఇచ్చి వచ్చానని, మధ్యాహ్నం భోజనం తీసుకెళ్లే సరికి శవమై కనిపించాడని కన్నీటి పర్యంతమయ్యారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

శంకర్‌రెడ్డికి సహకరించిందెవరో ?

- పలువురు వైద్యులకు నోటీసులు జారీ
- కడప డీఎంహెచ్‌వో ఆధ్వర్యంలో విచారణ

కడపక్రైం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసుకు సంబంధించి కడప సెంట్రల్ జైలులో రిమాండు ఖైదీగా ఉన్న శంకర్‌రెడ్డికి సహకరించింది ఎవరనే దానిపై అధికారులు ఫోకస్ పెట్టారు. ఇందులో భాగంగా పలువురు వైద్యులకు నోటీసులు కూడా అందించినట్లు తెలిసింది. కడప డీఎంహెచ్‌వో ఆధ్వర్యంలో విచారణ చేపట్టనున్నట్లు విశ్వసనీయ సమాచారం. అప్పట్లో వివేకా హత్య కేసులో ఎర్రగంగిరెడ్డి, శివశంకర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, సునీల్‌యాదవ్‌లు రిమాండు ఖైదీలుగా ఉన్నారు. అయితే 2022 నవంబరు 18న శివశంకర్‌రెడ్డి జైలుకు వెళ్లాడు. అనంతరం మరుసటి రోజే అనారోగ్య కారణంగా రిమ్స్ ఆసుపత్రిలో నెలరోజులపాటు చికిత్స పొందుతూ స్పెషల్ రూములో ఉన్నాడు. ఆ సమయంలో అప్పట్లో పనిచేసిన జైలుపర్యవేక్షణాధికారి, వైద్యురాలి పాత్ర ఉన్నట్లు ఆరోపణలున్నాయి. జైలుకు వచ్చిన మరుసటి రోజు నుంచే అనారోగ్యం పేరుతో రిమ్స్‌లో అడ్మిట్ కాగా, ఆయనకు ఎవరెవరు సహకరించారనే విషయంపై కూడా ఈ కమిటీ లోతుగా విచారిస్తోంది. దీంతో పాటు సెంట్రల్ జైలులో మెడికల్ క్యాంపు కూడా నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేటు వైద్యులు అందులో పాల్గొన్నారు. ఈ క్యాంపులో శంకర్‌రెడ్డి కుమారుడు పాల్గొని దస్తగిరికి డబ్బు ఆశ చూపించడంతో పాటు బెదిరించారంటూ అప్పట్లో దస్తగిరి ఆరోపణలు చేశాడు. కాగా శంకర్‌రెడ్డి జైలుకు వచ్చినప్పటి నుంచి వైద్యపరీక్షలకు ఎన్నిసార్లు వెళ్లాడు. ఇతనికి పోలీసులు, వైద్యశాఖ జైలుశాఖకు సంబంధించి ఎవరెవరు సహకరించారన్న అంశాలపై కూడా ఈ కమిటీ దర్యాప్తు చేయనుంది. ఇదిలా ఉండగా సోమవారం డాక్టర్ ప్రవీణ్‌కుమార్ (ఈయన అప్పట్లో సెంట్రల్ జైలులో పనిచేసేవారు)ను విచారించినట్లు తెలిసింది. వైద్యురాలు పుష్పలత, డాక్టర్ సుదర్శన్‌రెడ్డిలకు నోటీసులు అందించినట్లు సమాచారం. ఈ విషయంపై ఆంధ్రజ్యోతి డీఎంహెచ్‌వో డాక్టర్ నాగరాజును వివరణ కోరేందుకు పలుమార్లు ఫోను చేసినప్పటికీ ఆయన స్పందించలేదు.

ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలి

- ఎస్పీ అశోక్‌కుమార్



ఫిర్యాదుదారుల నుంచి ముఖాముఖి మాట్లాడి సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ

కడప క్రైం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో స్వీకరించే ఫిర్యాదులు పునరావృతం కాకుండా ఆయా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని పోలీసు అధికారులను ఎస్పీ ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని పెన్నార్ పోలీసు కాన్ఫరెన్స్ హాలులో ఎస్పీ ప్రజాఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా జిల్లా నలుమూల నుంచి వచ్చిన 149 మంది ఫిర్యాదుదారులతో ఎస్పీ ముఖాముఖి మాట్లాడారు. వారి ఫిర్యాదులపై వివరంగా అడిగి తెలుసుకుని ఫిర్యాదులన్నిటిని చట్టప్రకారం సంబంధిత పోలీసుస్టేషనులో అధికారులతో మాట్లాడి త్వరగా న్యాయం జరిగేలా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాశ్‌బాబు, మహిళా పీఎస్ డీఎస్పీ బాలస్వామిరెడ్డి పాల్గొన్నారు.

6 ముగ్గురు 'రిమ్స్' వైద్యులపై అభియోగాల విచారణకు నూతన అధికారి

- కార్యాలయం సూపరింటెండెంట్‌పై కూడా

ఎస్‌హెచ్‌జీ సొమ్ము రూ.17 లక్షలు స్వాహా

6
- మెప్మా సిబ్బంది నిర్లక్ష్యమేనా..?
- పోలీసుస్టేషనుకు చేరిన పంచాయితీ

ఉద్యోగం పేరిట మోసం

- రూ.9లక్షలు స్వాహా 7
- న్యాయం చేయాలంటూ వేడుకోలు

మయూరి అందాలు





నెమలి నాట్యం చేస్తుంటే.. చూసేందుకు రెండు కనులూ చాలవు. చింత కొమ్మదిన్నె పోలీసుస్టేషన్‌కు దగ్గరలో సోమవారం ఇలాంటి దృశ్యాలే కనువిందు చేశాయి. చుట్టూ కొండల మధ్య ప్రకృతిలో మమేకమై పైకి ఎగురుతూ.. చూపరులను కట్టిపడేశాయి. ఈ దృశ్యాలను ఆంధ్రజ్యోతి తన కెమెరాలో బంధించింది.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కడప

ప్రజా సమస్యలను పరిష్కరించాలి

- కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప కలెక్టరేట్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంలో అర్జీలు సమర్పించే బాధితుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సభాభవనంలో ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) కార్యక్రమం జరిగింది. జిల్లా నలమూలల నుంచి అర్జీదారులు తమ సమస్యలను కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ అదితిసింగ్, అధికారులకు తెలుపుతూ అర్జీలను సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యతనిస్తోందన్నారు. పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని తెలిపారు. అనంతరం అర్జీదారుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా నగరానికి చెందిన లక్ష్మీ ఫిర్యాదు చేస్తూ డీసీఎంఎస్‌లో ఫార్మశిస్టుగా 2024లో ఎంప్లాయిమెంట్ శాఖ ద్వారా కలెక్టర్ సెలెక్షన్‌తో పీఎం జనరిక్ ఔషధి కేంద్రంలో నియమించినట్లు తెలిపారు. అయితే తనకు 2 నెలల 15 రోజులకు సంబంధించిన జీతాలివ్వకుండా అధికారి నిలుపుదల చేశారు. తాను ఆర్థిక ఇబ్బందులో ఉన్నానని తెలిపారు. మైదుకూరు మండలం, జాండ్లవరం గ్రామ నివాసి నాగ మునెయ్య కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తూ తన సాగుబడిలో ఉన్న భూమిలో ఫోర్జరీ పత్రాలతో విద్యుత్ కనెక్షన్ ఏర్పాటు చేశారని, ఆ కనెక్షన్‌ను తొలగించాలన్నారు. తాను పేదవాడినని, తన బిడ్డలకు తల్లికివందనం పథకం అమలు చేయాలని జమ్మలమడుగు, బొమ్మేపల్లికి చెందిన రెడ్డప్పనాయక్ ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, ఎస్డీసీ వెంకటపతి, జడ్పీ సీఈవో ఓబులమ్మ, జిల్లా అధికారులు సరస్వతి, రాజ్యలక్ష్మీ, కిరణ్‌కుమార్, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

బార్ల కోసం దరఖాస్తుల ఆహ్వానం

- 26న చివరి తేది
- 28న లాటరీ ద్వారా ఎంపికలు
- ఎక్సైజ్ డిప్యూటీ కమిషనరు జయరాజ్



నూతన బార్ల పాలసీ జీవోను ఆవిష్కరిస్తున్న ఎక్సైజ్ అధికారులు

కడప క్రైం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం 2025- 28 మూడేళ్లకు సంబంధించి నూతన బార్ పాలసీ ప్రవేశపెట్టినట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనరు జయరాజ్ వెల్లడించారు. ఈ నెల 26 వరకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని 28న కలెక్టరేట్‌లోని సభాభవనంలో లాటరీ పద్ధతి ద్వారా ఎంపికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కడప నగరం ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో ఆయన సోమవారం అసిస్టెంటు డిప్యూటీ కమిషనరు చంద్రశేఖరరెడ్డి, సూపరింటెండెంట్ రవికుమార్‌తో కలిసి నూతన బార్‌పాలసీ విధా నాన్ని వెల్లడించారు. ఈ సందర్భంగా మాట్లా డుతూ 2022-25కు సంబంధించి వేలం పద్ధతి లో అనుసరించేవారమని, అయితే 2025-28 సంవత్సరాలకు సంబంధించి లాటరీ పద్ధతి ద్వారా ఎంపికలు నిర్వహిస్తున్నామన్నారు. గతంలో రూ.7.5 నుంచి 10 లక్షల వరకు ఫీజు ఉంటే ప్రస్తుతం ఐదులక్షలు మాత్రమే చెల్లించాలన్నారు. ఎంపికైన వారు కేవలం రూ.55 లక్షలు ఆరు దఫాలుగా చెల్లించేలా సౌకర్యం కల్పించారన్నారు. ఎర్రగుంట్ల, కమలాపురంలో మాత్రం రూ.35 లక్షలు మాత్రమే చెల్లించాల్సి ఉంటుందన్నారు. గతంలో వేలంపాట ద్వారా రూ.1.89 కోట్లు కడప జిల్లా నిలచిందని, అయితే అంత ధర లేకుండా కేవలం రూ.55 లక్షలకు తగ్గించిందని ఈ బార్ విధానం పక్షపాతం లేకుండా, గుత్తాధి పత్యం ఉండదని తెలిపారు. ఒక్కో బార్‌కు సంబంధించి కనీసం నాలుగు దరఖాస్తులు ఉండాలని అప్పుడే లాటరీల ద్వారా ఎంపిక చేస్తామన్నారు. గతంలో ఉదయం 11 నుంచి రాత్రి 11 గంటల వరకు ఉన్న సమయాన్ని ఉదయం 10 నుంచి రాత్రి 12 గంటల వరకు అంటే 3గంటలు అదనంగా బార్లు నిర్వహించుకునేలా అనుమతులు ఇస్తున్నామని తెలిపారు. ఎంచుకున్న బార్లకు ఎమ్మార్పీ ధరలు వర్తించవన్నారు. గతంతో పోలిస్తే ఈ విధానం అందరికీ బాగుంటుందని, జిల్లాలో ఎవరూ ఎక్కడి నుంచైనా ఏ జిల్లా వారైనా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. అలాగే గీత కులాలకు రెండు బార్లకు అనుమతి వచ్చిందన్నారు. కడప, ప్రొద్దుటూరు గీత కులాలకు చెందిన ఈడిగ, గౌడకులాలు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జిల్లా వ్యాప్తంగా 28 బార్లు ఉన్నాయని, ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

కడప కలెక్టరేట్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రెండు బార్లను లాటరీ పద్ధతి ద్వారా గీతాకులాలకు కేటాయించినట్లు కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ శాఖ, కలెక్టర్ ఆధ్వర్యంలో మద్యం బార్లకు లాటరీ నిర్వహించారు. కడప కార్పొరేషన్‌ను గౌడ్ ఉపకులానికి, ప్రొద్దుటూరు మున్సిపాలిటీని ఈడిగ ఉపకులానికి లాటరీ ద్వారా బార్లను కేటాయించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనరు జయరాజ్, జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారి రవికుమార్, జిల్లా ఈడిగ సంఘం సెక్రటరీ సుబ్రమణ్యంలు హాజరయ్యారు.



లాటరీ ద్వారా బార్లను ఎంపిక చేస్తున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

విధులకు వెళ్తూ.. తిరిగిరాని లోకాలకు....

- ముదివేడు క్రాస్ వద్ద రోడ్డు ప్రమాదం..
- కంటైనర్-ద్విచక్రవాహనం ఢీకొని హోంగార్డు మృతి


మృతి చెందిన హోంగార్డు ఈశ్వర్‌నాయక్

కురబలకోట, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): కడప-మదనపల్లె ప్రధాన జాతీయ రహదారిపై ముదివేడు క్రాస్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో హోంగార్డు అక్కడికక్కడే మృతి చెందిన విషాదకర సంఘటన సోమవారం రాత్రి మండలంలో చోటు చేసుకుంది. స్థానిక పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. తంబళ్లపల్లె మండలం కోటకొండ తండా వాసి ఈశ్వర్‌నాయక్ హోంగార్డుగా పనిచేస్తున్నాడు. కాగా ఆయన మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో రాత్రి వేళ విధులకు కోసం ద్విచక్రవాహనంలో బయలుదేరాడు. మార్గమధ్యలోని ముదివేడు క్రాస్ మిట్ట వద్ద ఎదురుగా వస్తున్న కంటైన ర్ ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహననంలో ప్రయాణిస్తున్న ఈశ్వర్‌నాయక్ అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటనా స్థలానికి ముదివేడు ఎస్ఐ దిలీప్‌కుమార్ చేరుకుని విచారించి ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా మృతుడి కుటుంబీకుల రోదనలు ఆస్పత్రిలో మిన్నంటాయి. ప్రమాదం కారణంగా రోడ్డుకు ఇరువైపులా వాహనాలు బారులు తీరి నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ముదివేడు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఈ మేరకు ముదివేడు పోలీసు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరు పశుసంవర్థకశాఖ ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు


పి.లలిత, వి.ఎస్.కె. మైనుద్దీన్

పీలేరు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): తమ శాఖకు చెందిన ఇద్దరు ఉద్యోగుల ఉత్తమ పనితీరుకు ప్రశంసాపత్రాలు లభించినట్లు జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి గుణశేఖర్‌పిళ్లై సోమవారం తెలిపారు. పీలేరులోని నియోజకవర్గ స్థాయి పశువ్యాధి నిర్ధారణ ప్రయోగశాల ల్యాబ్ టెక్నీషియన్ పి.లలిత, మదనపల్లెలోని పశుసంవర్థక శాఖ డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయంలో డేటా ఎంట్రీ ఆపరేటర్ వి.ఎస్.కె. మైనుద్దీన్‌కు ఏటా స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా అందించే ప్రశంసా పత్రాలకు ఎంపికయ్యారని ఆయన వివరించారు. వారిద్దరికీ ఈ నెల 20వ తేదీన విజయవాడలోని తమ శాఖ ప్రధాన కార్యాల యంలో జరిగే కార్యక్రమంలో ప్రశంసా పత్రాలు అందిస్తారని తెలి పారు. పీలేరులో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్న పి.లలిత, తన పనితీరు కారణంగా అనేక పశువ్యాధుల చికిత్సలో వైద్యులకు సహాయ కారిగా ఉంటున్నారన్నారు. అన్నమయ్య జిల్లా నుంచి వారిద్దరూ ఎంపిక కావడం అభినందనీయమన్నారు.

జాతీయ స్థాయి షూటింగ్ బాల్ పోటీలకు కన్నెమడుగు విద్యార్థిని


విద్యార్థిని సంధ్య

తంబళ్లపల్లె, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): కన్నెమడుగు ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదివిన టి.సంధ్య జాతీయ స్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు పీడీ ఖాదర్‌భాష తెలిపారు. అన్నమయ్య జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ కన్వీనర్ సురేష్ బాబు, జిల్లా కార్యదర్శి గౌతం, ఏపీ షూటింగ్ బాల్ కార్య దర్శి పరశురాముడు నుంచి ఎంపిక ఉత్తర్వులు వచ్చినట్లు తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్ 25, 26 తేదీల్లో వశిష్ట ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో సంధ్య జిల్లా తరుపున పాల్గొని సత్తా చాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. 22, 23, 24 బీహార్ రాష్ట్రం బుద్ధ గయలో జరిగే 44వ జాతీయ స్థాయి పోటీల్లో సంధ్య పాల్గొంటుంద న్నారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన సంధ్యను ఎంఈఓలు త్యాగరాజు, నాగసుబ్బరాయుడు, హెచ్ఎం మదన్‌మోహన్, పీడీ, ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి


పోలీసులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

రాజంపేట, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): నదీ పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు తెలిపారు. రాజంపేట ప్రాంతంలో నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పింఛా డ్యాం నిండినందున కలెక్టర్ ఆధ్వర్యంలో గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదిలారు. ఈ నేపథ్యంలో చెయ్యేరు నదీ పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మన్నారు పోలీసులు హెచ్చరించారు. ఈ మేరకు బాలరాజుపల్లె వద్ద హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. వరదనీరు ఎక్కువగా వస్తున్నందున ఎవరూ చెయ్యేరు నదిలోకి వెళ్లరాదని, రాజంపేట, నందలూరు, పెనగలూరు, చెయ్యేరు నదీ పరివాహక ప్రాంతాల ప్రజలు నదిలోకి వెళ్లకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు.

ములకలచెరువు మార్కెట్టే టాప్...!

- రికార్డు స్థాయిలో టమోటా క్రయ విక్రయాలు... ఎగుమతులు
- మదనపల్లెను మళ్లీ వెనక్కి నెట్టిన వైనం
- మార్కెట్‌కు పోటెత్తుతున్న టమోటాలు
- మార్కెట్‌కు రూ.కోట్లలో ఆదాయం
- రైతులకు గుక్కెడు నీరు... కనీస వసతులు కరువు


ములకలచెరువు మార్కెట్‌కు భారీగా అమ్మకానికి వచ్చిన టమోటాలు

ములకలచెరువు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): టమోటా క్రయ విక్రయాలు...ఎగుమతుల్లో టాప్‌గా ములకలచెరువు టమోటా మార్కెట్ నిలిచింది. ఆసియాలోనే నెంబర్ వన్ మార్కెటైన మదనపల్లెను మళ్లీ వెనక్కి నెట్టింది. ఇంకా సీజనే ప్రారంభం కాలేదు...అప్పుడే మార్కెట్‌కు టమోటాలు పోటెత్తుతున్నాయి. మరో నాలుగైదు రోజుల్లో సీజన్ ప్రారంభమవుతుంది. టమోటాలు మరింతగా అమ్మకానికి వస్తాయి....టమోటా మార్కెట్ కళకళలాడుతోంది. అత్యధికంగా రైతులు పండించిన టమోటాలను ఇక్కడికే అమ్మకానికి తెస్తున్నారు. మార్కెట్‌కు రూ.కోట్లలో ఆదాయం...అయినా ఇక్కడ రైతులకు గుక్కెడు నీరు, కనీస వసతులు కరువయ్యాయి. ఏళ్ల తరబడిగా రైతుల సమస్యలకు పరిష్కారం లభించడం లేదు.

తంబళ్లపల్లె నియోజకవర్గానికి సంబంధించి వ్యవసాయ మార్కెట్ ములకలచెరువులో ఉంది. దీనికి 1977లో ప్రారంభించారు. తంబళ్లపల్లె నియోజకవర్గంలోని పెద్దమండ్యం, తంబళ్లపల్లె, పెద్దతిప్పసముద్రం, బి.కొత్తకోట మండలాలతో పాటు శ్రీసత్యసాయి, అనంతపురం జిల్లాలలోని పలు గ్రామాల రైతులు టమోటాలను విక్రయించేందుకు ఇక్కడికి తీసుకొస్తారు. ప్రతిరోజూ వందలాది మంది రైతులు మార్కెట్‌కు వస్తుంటారు. సీజన్‌లో అయితే రైతుల సంఖ్య రెట్టింపుగా ఉంటుంది.


పిల్లర్లకే పరిమితమైన వాణిజ్యగదుల నిర్మాణం

టాప్ ప్లేస్‌లోకి ములకలచెరువు మార్కెట్

ములకలచెరువు టమోటా మార్కెట్ టాప్ ప్లేస్‌లోకి వచ్చింది. టమోటా క్రయ విక్రయాలు, ఎగుమతుల్లో ఆసియాలోనే అతిపెద్ద మార్కెట్‌గా పేరొందిన మదనపల్లె వ్యవసాయ మార్కెట్‌ను ములకలచెరువు మళ్లీ వెనక్కి నెట్టింది. 20 రోజులుగా మదనపల్లె కంటే ములకలచెరువు వ్యవసాయం మార్కెట్‌కు అత్యధికంగా టమోటాలు అత్యధికంగా వస్తున్నాయి. క్రయవిక్రయాలతో పాటు ఇతర రాష్ట్రాలకు అత్యధికంగా ఎగుమతి అవుతున్నాయి. సాయంత్రం మార్కెట్ కావడంతో రైతులకు ఎంతో అనుకూలంగా ఉంది. ప్రస్తుతం మార్కెట్‌కు టమోటాలు పోటెత్తుతున్నాయి. ప్రతిరోజూ 300 నుంచి 500 మెట్రిక్ టన్నుల కాయలు ఇతర రాష్ట్రాలకు ఎగుమతి అవుతున్నాయి. మదనపల్లెలో కేవలం 140 నుంచి 300 మెట్రిక్ టన్నులు మాత్రమే ఎగుమతి అవుతున్నాయి. దీనిని బట్టి చూస్తే ములకలచెరువు మార్కెట్ టాప్ ప్లేస్‌లో ఉంది. గత ఏడాది సీజన్‌లో కూడా ములకలచెరువు మార్కెట్‌లో మదనపల్లె మార్కెట్ కంటే అత్యధికంగా టమోటా క్రయవిక్రయాలు, ఎగుమతులు అయ్యాయి. తాజాగా మళ్లీ సీజన్ ప్రారంభం కాక ముందే మదనపల్లెను వెనక్కి నెట్టి మొదటి స్థానానికి చేరింది. సీజన్‌లో మరింతగా క్రయవిక్రయాలు, ఎగుమతులు జరగనున్నాయి. అలాగే మార్కెట్ కమిటీ ఆదాయం లక్ష్యాన్ని మించి వస్తోంది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.కోటి లక్ష్యం కాగా రూ.1.10 కోట్లు, 2023-24లో రూ.1.10 కోట్లు లక్ష్యం కాగా రూ.1.12 కోట్లు, 2024-25లో రూ.1.24 కోట్లు లక్ష్యం కాగా 1.32 కోట్లు ఆదాయం వచ్చింది. టమోటాలు ఎగుమతి చేసే వాహనాలకు విధించే సెస్సుల ద్వారా ఈ ఆదాయం సమకూరుతోంది.

వైసీపీ పాపం....రైతులకు శాపం

గత వైసీపీ ప్రభుత్వ పాలనలో ములకలచెరువు మార్కెట్ కనీస అభివృద్ధికి నోచుకోలేదు. ప్రభుత్వానికి ములకలచెరువు మార్కెట్ ద్వారా రూ.కోట్లలో ఆదాయం ఉన్నా రైతులకు మాత్రం కనీస వసతులు కల్పించడంతో విఫలమైంది. రైతుల సంక్షేమానికి, అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నామని ఊదరగొట్టిన వైసీపీ ప్రభుత్వం చేతుల్లో మాత్రం చూపలేదన్నడానికి ములకలచెరువు మార్కెట్టే నిదర్శనం. మార్కెట్‌లో నాలుగేళ్ల పాటు కనీసం తాగునీటి వసతి కల్పించలేదు. మార్కెట్‌లో ఉన్న తాగునీటి వాటర్ ప్లాంటు మరమ్మతులు చేయించడానికి పాలకులకు తీరిక దొరక్కుండా పోయింది. మార్కెట్లలో మండీ యజమానులు తాగునీటి సౌకర్యం కల్పించడంతో ఉపశమనంగా ఉంది. దూరప్రాంతాల నుంచి వస్తున్న రైతులకు విశ్రాంతి తీసుకునేందుకు భవనం నిర్మించలేదు. 2021 అక్టోబరులో మార్కెట్‌లో అభివృద్ధి పనులను ప్రారంభించారు. అప్పట్లో మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులు అరకొరగా 15 వాణిజ్య గదుల నిర్మాణానికి రూ.1.20 కోట్లు, మరుగుదొడ్ల నిన్మాణానికి రూ.5 లక్షలు, క్యాంటీన్ నిర్మాణానికి రూ.77 లక్షలు మంజూరు చేశారు. ఇందుల్లో కేవలం వాణిజ్య గదుల నిర్మాణాలను మాత్రం ప్రారంభించి కొంత మేరకు పనులు చేపట్టి వదిలేశారు. మిగిలిన పనులు ప్రారంభించలేదు. దీంతో నిధులన్నీ వెనక్కి వెళ్లాయి. మార్కెట్‌లో కనీస వసతుల కల్పనపై రైతులు కూటమి ప్రభుత్వంపైనే ఆశలు పెట్టుకున్నారు. మార్కెట్‌లో సీపీ రోడ్డులు వేయాల్సి ఉంది. రైతులకు తాగునీటి వసతి కల్పన, విశ్రాంతి గది నిర్మించాల్సి ఉంది. అలాగే మరుగుదొడ్ల కొరత కూడా తీర్చాల్సి ఉంది.

టమోటా ఎగుమతి అవుతున్న రాష్ట్రాలు...దూరం

ములకలచెరువు మార్కెట్ నుంచి టమోటాలు ఎగుమతి అవుతున్న రాష్ట్రాలు, వాటి దూరం ఇలా ఉంది. ములకలచెరువు నుంచి మహారాష్ట్ర (1000 కిలోమీటర్లు), చత్తీస్‌ఘడ్ (1233 కిలోమీటర్లు), కోల్‌కతా (1741 కిలోమీటర్లు), ఝార్ఖండ్ (1890 కిలో మీటర్లు), ఉత్తరప్రదేశ్ (2038 కిలోమీటర్లు), ఉత్తరాఖండ్ (2388 కిలోమీటర్లు), జమ్ము (2825 కిలోమీటర్లు). ఇక్కడి నుంచి టమోటాలు వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న రాష్ట్రాలకు ఎగుమతి అవుతున్నాయి. ఇక్కడి టమోటాలకు బయటి రాష్ట్రాల్లో డిమాండ్ బాగా ఉంది.

మార్కెట్‌లో సమస్యల పరిష్కారానికి కృషి



ములకలచెరువు మార్కెట్ యార్డులో నెలకొన్న సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తున్నాం. రైతుల విశ్రాంతి భవనం, కమిటీ కార్యాలయం నవీకరణకు రూ.20 లక్షలతో ప్రతిపాదనలు పంపాము. అలాగే ఆగిన వాణిజ్య గదుల నిర్మాణానికి ప్రతిపాదించాం. తాగునీటి వాటర్ ప్లాంట్ మరమ్మతులకు చర్యలు తీసుకున్నాం. మార్కెట్‌లో విడతల వారీగా సమస్యలన్నంటిని పరిష్కరిస్తాం.

- నవీన్, వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి, ములకలచెరువు

వైభవంగా మల్లన్న కుంభాభిషేక మహోత్సవం

- శివనామస్మరణతో మార్మోగిన మల్లయ్యకొండ


మల్లయ్యకొండ పైన వరుణయాగం చేస్తున్న వేద పండితులు

తంబళ్లపల్లె, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మల్లయ్యకొండపై వెలసిన భ్రమరాంభిక సమేత మల్లికార్జున స్వామి ఆలయంలో సోమవారం వరుణయాగం, కుంభాభిషేకం, రాత్రి దీపారాధన మహోత్సవాలను వైభవంగా నిర్వహించారు. సకాలంలో వర్షాలు సమృద్ధిగా కురిసి గ్రామాలు పాడి పంటలతో సభిక్షంగా ఉండాలని ఏటా మల్లయ్యకొండపైన కుంభాభిషేకం, వరుణయాగం నిర్వహించడం ఆనవాయితీ. ఈ ఏడాది ఆలయ ఈఓ మునిరాజ ఆధ్వర్యంలో వేదపండితులు వెంకట్రమణ, కుమారస్వామి, ఆలయ అర్చకులు ఈశ్వరప్ప, మల్లికార్జున స్వామి కుంభాభిషేక మహోత్సవాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. సోమవారం ఉదయం 9 గంటలకు నవగ్రహ పూజ, 10:30 నుంచి మంగళవాయిద్యాలు, వేద మంత్రోచ్చారణల నడుమ వరుణయాగం హోమం నిర్వహించారు. ఆలయంలోని శివలింగానికి 101 బిందెల నీటితో అభిషేకించి ధూప, దీప నైవేద్యాలతో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కుంభాభిషేకాన్ని తిలకించేందుకు జిల్లా నుంచే కాకుండా పొరుగు జిల్లాలు, కర్నాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి సైతం భక్తులు కుటుంబ సమేతంగా అశేషంగా తరలివచ్చారు. భక్తులు చేసే శివనామస్మరణతో మల్లయ్యకొండ మార్మోగింది. కొండ పైన భక్తులకు అన్నదానం నిర్వహించారు. భక్తులకు ఎలాంటి సౌకర్యం కులగకుండా ఆలయ రికార్డు అసిస్టెంట్ కొండ కిట్ట, సిబ్బంది ఈశ్వర అన్ని ఏర్పాట్లు చేశారు.

కొండపైకి ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఫ్రీ

కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన స్త్రీ శక్తి పథకం ద్వారా మల్లయ్యకొండ పైకి మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చు. సోమవారం సుమారు 250 మంది మహిళలు ఆర్టీసీ బస్సుల్లో మల్లయ్యకొండకు ప్రయాణించినట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు.. టీడీపీ బీసీ నేత చంద్రశేఖర్, మాజీ ఉప సర్పంచ్ మణి, ఎస్ఎంసీ ఛైర్మన్ శివకుమార్, వికలాంగ అధ్యక్షుడు రామాంజులు ఆర్టీసీ సిబ్బందితో కలసి కొండకు వెళ్లే మహిళా భక్తులకు ఉచిత టికెట్ కొట్టారు. మహిళలు సంతోషం వ్యక్తం చేస్తూ కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

ఫిర్యాదుదారులకు బాసటగా నిలవండి : ఎస్పీ


ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

రాయచోటిటౌన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఫిర్యాదుదారులకు బాసటగా నిలవడంతో పాటు బాధితుల సమస్యలను చట్టపరిధిలో పరిష్కరించాలని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి అర్జీలను స్వీకరించి అర్జీదారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకొని వారి ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించారు. సమస్యలపై సంబంధిత పోలీసు అధికారులతో స్వయంగా ఫోన్‌లో మాట్లాడి సత్వర న్యాయం అందించేలా కృషి చేయాలని తెలిపారు.

ముగ్గురు 'రిమ్స్' వైద్యులపై అభియోగాల విచారణకు కొత్త అధికారి

- కార్యాలయం సూపరింటెండెంట్‌పై కూడా


కలికిరి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): కడప 'రిమ్స్' వైద్యులపై నమోదైన అభియోగాలపై విచారణ నిర్వహించేందుకు కొత్త అధికారిని నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. 2018లో రిమ్స్‌లో పనిచేస్తున్న ముగ్గురు వైద్యులతో పాటు మరో కార్యాలయం సూపరింటెండెంట్‌పై అభియోగాలు నమోదయ్యాయి. రిమ్స్‌లో పనిచేస్తున్న ఆర్థో విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.సురేశ్వరరెడ్డి, అదే విభాగంలోని మరో అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సి.సంజీవయ్య, కంటి విభాగంలో పనిచేసే అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎంవీడీఎల్ సత్యనారాయణ, కార్యాలయం సూపరింటెండెంట్ షేక్ మహబూబ్‌బాషాలపై కొన్ని అక్రమాలకు సంబంధించిన అభియోగాలు నమోద య్యాయి. ఈ వ్యవహారాలపై సమగ్ర విచారణకు అప్పటి వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి డాక్టర్ పూనం మాలకొండయ్య 2018లో ఆదేశాలు జారీ చేశారు. అప్పటి నుంచి ఈ వ్యవహారం మరుగన పడింది. తాజాగా విచారణ నిర్వహించడానికి తిరుపతి సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జి.రవిప్రభును నియమిస్తూ గత ఏడాది నవంబరు 27న ఆదేశాలు జారీ అయ్యాయి. విచారణ జరుగుతుండగా తనకు ఆరోగ్యం సహకరించలేదనే కారణాలతో విచారణాధికారి తప్పుకున్నారు. తాజాగా ఈ వ్యవహారాన్ని విచారించడానికి విజయవాడ డైరెక్టరేట్ కార్యాలయంలో పనిచేసే వైద్య విద్య అదనపు డైరెక్టరు డాక్టర్ డి.వెంకటేశ్వరరావును నియమిస్తూ ఆరోగ్య వైద్య శాఖ కార్యదర్శి డాక్టర్ మంజుల డి హోస్మణి సోమవారం ఆదేశాలు జారీ చేశారు. గత విచారణాధికారి విచారణ జరిపి ఆపి వేసినప్పటి నుంచి విచారణ కొనసాగించాలని ఆదేశించారు.

బంగారు నగలు చోరీ

గాలివీడు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): గాలివీడులోని గౌతమ్ స్కూల్ పక్కన ఉన్న మల్లయ్య ఇంటిలో ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించి బంగారు నగలు దోచుకెళ్లినట్లు ఎస్ఐ రామక్రిష్ణ తెలిపారు. శనివారం బాధితుడు మల్లయ్య సమీప బంధువు పెద్దకర్మకు మాధవరం వెళ్లాడు. విషయం తెలుసుకున్న దొంగలు రాత్రి ఇంట్లోకి ప్రవేశించి పూజ గదిలో ఉన్న 5జతల బంగారు కమ్మలు, మూడు చైన్లు, మూడు ఉంగరాలు తదితరవి తీసుకెళ్లినట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న బాధితుడు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఎస్‌హెచ్‌జీ సొమ్ము రూ.17 లక్షలు స్వాహా

- మెప్మా సిబ్బంది నిర్లక్ష్యమేనా.. ?
- పోలీసుస్టేషనుకు చేరిన పంచాయితీ



ప్రొద్దుటూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధిలోని స్వయం సహాయక మహిళా సంఘాలు.. మెప్మా అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంతో గాడి తప్పుతున్నాయి. స్వయం సహాయక మహిళా సంఘాలను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాల్సిన ఆర్‌పీలు, సీవోలు, సీఎంఎంలు నెలనెలా సమావేశాలు నిర్వహించి వారి బుక్‌లు పరిశీలించాలి. ఇందువల్ల కొన్ని ఎస్‌హెచ్‌జీ గ్రూపుల్లో లీడర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ గ్రూపు సభ్యులు లోను కంతులకని ఇచ్చిన సొమ్ము బ్యాంకులో చెల్లించకుండా స్వాహా చేసి చేతులెత్తేయడంతో బ్యాంకు అధికారులు గ్రూపు సభ్యులకు లోను చెల్లించాలని నోటీసులు జారీ చేస్తున్నారు. దీంతో దిక్కు తోచక గ్రూపు సభ్యులు పోలీసులను ఆశ్రయించి న్యాయం చేయాలని కోరుతున్నారు. వివరాల్లోకి వెళితే..

ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధిలోని శ్రీనివాస నగర్‌కు చెందిన నూరె స్వయం సహాయక మహిళా సంఘంలో మొదటి, రెండవ లీడర్లు ఇద్దరు గ్రూపు సభ్యుల లోను కంతులకు అని ఇచ్చిన రూ.17.50 లక్షల సొమ్మును బ్యాంకు లో కట్టకుండా స్వాహా చేశారు.ఈ విషయం గత కొంతకాలంగా మెప్మాసిబ్బందికి తెలిసి మల్లగుల్లాలు పడుతున్నారు. ఇద్దరు లీడర్లు డబ్బులు కడతామని చెపుతూ వాయిదాలు వేస్తూ చివరికి చేతులు ఎత్తేయడం బ్యాంకు అధికారులు లోను డబ్బులు గ్రూపు సభ్యులు కట్టాలని లేకుంటే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని నోటీసులు ఇవ్వడంతో గ్రూపు సభ్యులు ఆందోళన చెంది సోమవారం టూటౌన్ పోలీసులను ఆశ్రయించారు. తాము తీసుకున్న రూ 20 లక్షల బ్యాంకులోనుకు సంబంధించి కంతులన్ని కట్టామని అయిన 17.50 లక్షలు డబ్బులు బ్యాంకుకు బాకీ వున్నారని నోటీసులు అందడంతో లీడర్లు ఇద్దరి పై చర్యలు తీసుకోని వారి నుండి డబ్బు రికవరీ చేసి తక్కిన ఎనిమిది మంది గ్రూపు సభ్యులకు న్యాయం చేయాలని వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు సిఐ సదాశివయ్య ను వివరణ కోరగా డబ్బులు స్వాహా చేసిన లీడర్లు ఇద్దరితో పాటు వారి కుటుంబ సభ్యులను మెప్మా సిబ్బందిని విచారించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అంతర్‌రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

- అదుపులో ఐదుగురు నిందితులు
- 10 ద్విచక్ర వాహనాలు స్వాధీనం

జమ్మలమడుగు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగులోని ప్రొద్దుటూరు రోడ్డులో సోమవారం వాహనాల తనిఖీలో తమ సిబ్బంది అయిదుగురు అంతర్ రాష్ట్ర ముఠా సభ్యులను అరెస్టు చేసినట్లు జమ్మలమడుగు డీఎస్పీ వెంకటేశ్వరరావు తెలిపారు. సోమవారం జమ్మలమడుగు అర్బన్ పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పట్టుబడిన అంతర్‌రాష్ట్ర ముఠా గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూలై 10వ తేదీన మధ్యాహ్నం సమయంలో జమ్మలమడుగు ఆర్టీసీ బస్టాండు వద్ద పార్కింగ్ చేసిన ఏపీ04డిఎస్0156 నంబరు గల హోండా ఆక్టివా స్కూటీని చోరీ చేశారని, దాని విలువ రూ.90 వేలు ఉంటుందని బాధితుడు రామమోహన్ ఫిర్యాదు చేశాడు. దీంతో జమ్మలమడుగు అర్బన్ సీఐ లింగప్ప, ఎస్ఐ హైమావతి పాత నేరస్తులపై ప్రత్యేక నిఘా పెట్టడం జరిగిందన్నారు. వారి సమాచారం మేరకు అయిదుగురిని పాత మోటారు సైకిళ్ల చోరీల్లో ఉన్నారని, గంజాయి కేసుల్లో ఉన్నారని, ప్రొద్దుటూరు రోడ్డులో వారిని అరెస్టు చేసి విచారణ చేపట్టడం జరిగిందన్నారు. వారి వద్ద నుంచి తొమ్మిది మోటారు సైకిళ్ల చోరీలకు వినియోగించే వారి వద్ద ఉన్న మరో ద్విచక్ర వాహనం, మొత్తం పదింటిని స్వాధీనం చేసుకున్నామన్నారు. పట్టుబడిన వారు అచ్చుకట్ల అబ్దుల్ రజాక్ (భాగ్యనగర్ కాలనీ, జమ్మలమడుగు), షేక్ గైబూసావలి (భాగ్యనగర్ కాలనీ, జమ్మలమడుగు), వినుకొండ దూదేకుల నాయబ్‌రసూల్ (శ్రీరాంనగర్, జమ్మలమడుగు), వనం రామ్‌చరణ్ (బీసీ కాలనీ, జమ్మలమడుగు), షేక్ పెద్దమస్తాన్ (వెంకటేశ్వర కాలనీ, జమ్మలమడుగు) పట్టుబడిన వారిని విచారించగా జమ్మలమడుగు, ఒంటిమిట్ట, తలమంచిపట్నం, ఓర్వకల్లు, హైదరాబాదు, కర్నూలు, తదితర ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాలు చోరీ చేసినట్లు, హైదరాబాదు, కర్నూలుకు చెందినవి పరిశీలించాల్సి ఉందని డీఎస్పీ తెలిపారు. వాటి విలువ మొత్తం రూ.10 లక్షలు అవుతుందని, స్వాధీనం చేసుకున్న వాహనాలను సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా అర్బన్ సీఐ లింగప్ప, ఎస్ఐ హైమావతిని అభినందించారు. ఈ కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ దాసు, రియాజ్, తదితరులు పాల్గొన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటేశ్వరరావు, పట్టుబడిన దుంగలు

సాగులో 'నానో' విప్లవం

నంగనూరుపల్లెసమీపంలో విస్తారంగా సాగైన వరిపైరు



ప్రొద్దుటూరు రూరల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): వంద కిలోల యూరియా వాడే పంటలో కేవలం అరలీటరు నుంచి ఒక లీటరు నానో నత్రజని లిక్విడ్ సరిపోతే... ఇతర పోషకాలు అరలీటరు, లీటరుతో సరిపోతే... దాదాపు సూక్ష్మపోషకాలన్నీ కిలోలకు బదులు మిల్లీ లీటర్లలో పంటకు అవసరమైతే... అంతకుమించిన వరం రైతన్నకు మరొకటి ఉండదు. దీన్ని సుసాధ్యం చేస్తూ వ్యవసాయంలో అద్భుతాలు సృష్టించేందుకు సిద్ధమవుతోంది నానో టెక్నాలజీ. వ్యవసాయ రంగంలో శాస్త్ర ప్రగతి దినదినాభివృద్ధి చెందిన నేపథ్యంలో సేద్య రంగంలో సరికొత్త విప్లవానికి నాంది పలుకుతోంది. సూక్ష్మ రూపంలో లభ్యమయ్యే నానో ఫర్టిలైజర్ పంటల్లో పోషకాలు, సూక్ష్మ పోషకాలను సమర్థవంతంగా అందించడం వలన రైతులకు ఎరువుల వాడకం తగ్గుతుంది. తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి సాధించడంతోపాటు పర్యావరణ కాలుష్యం తగ్గుతుంది. ఈ టెక్నాలజీ వ్యవసాయ రంగంలో రెండో హరిత విప్లవానికి నాంది అని వ్యవసాయ శాస్త్రవేత్తలు విశ్లేషిస్తున్నారు.

నానో ఎరువులపై అవగాహన లేక...

అన్నదాతకు ఎరువు భారం తగ్గించేందుకు ప్రభుత్వం నానో ఎరువులను అందుబాటులోకి తెచ్చింది. కానీ వీటిపై రైతుల్లో ఇంకా పూర్తి స్థాయిలో అవగాహన లేక ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. తక్కువ ధరతోపాటు సులభంగా రవాణా చేసేందుకు వీలున్న నానో ఎరువులు, బయో ఎరువులను వినియోగిస్తే మేలు చేకూరుతుందని అధికారులు సూచిస్తున్నారు. ప్రొద్దుటూరు వ్యవసాయ డివిజన్ పరిధిలో ఖరీఫ్ సీజన్‌లో సుమారు ఎనిమిది వేల ఎకరాల్లో సాధారణ వరి సాగు విస్తీర్ణం. ప్రొద్దుటూరు మండల పరిధిలో 3,700 ఎకరాలు, జమ్మలమడుగు మండలంలో 2,700, పెద్దముడియం మండలంలో 800, మైలవరం మండలంలో 650 ఎకరాల సాధారణ వరి విస్తీర్ణం ఉండగా ప్రస్తుతం ఆయా ప్రాంతాల్లో సాగునీరు లభ్యతను బట్టి వరి సాగు వివిధ దశల్లో ఉంది. గత కొన్ని రోజులుగా వర్షాలు కురవడంతో పనులు ఊపందుకున్నాయి. వరి పండిస్తున్న రైతులు ఎక్కువగా యూరియా, డీఏపీ ఎరువులు వాడుతున్నారు. వీటి ధర ఎక్కువ కావడంతో, సమయానికి నీటి తడులు ఎక్కువైనా, తక్కువైనా ఎరువులు వృథా అవ్వవచ్చు. ఆ స్థితి నుంచి రైతులు ఉపశమనం పొందాలంటే నానో ఎరువులు పనికొస్తాయని అధికారులు పేర్కొంటున్నారు.

● నానో ఎరువు... రైతుకు తగ్గనున్న బరువు
● రవాణా ఖర్చులో ఊరట ● సుభిక్షంగా భూసారం

నానో వైపు అవగాహన కల్పిస్తున్నాం



ప్రొద్దుటూరు డివిజన్ పరిధిలో నానో యూరియా, డీఏపీ అందుబాటులో ఉన్నాయి. వీటి వినియోగంతో రైతులకు ఆర్థికభారం, శారీరక శ్రమ తగ్గుతాయి. సాధారణ యూరియా, డీఏపీలు ఎంత పనిచేస్తాయో నానో యూరియాలో అంతకుమించి ప్రభావం ఉంటుంది.సాధారణ ఎరువులు వేసేందుకు రైతులు ఉండాలి. నానో ఎరువులు డ్రోన్ ద్వారా, డ్రమ్ ద్వారా కూడా పిచికారి చేసుకోవచ్చు. ఈ నానో టెక్నాలజీపై రైతుల్లో విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాం.

- సాంబ వరాహరికుమార్, ఏవో, ప్రొద్దుటూరు.



మార్కెట్‌లో అందుబాటులో ఉన్న నానోయూరియా, నానో డీఏపీ

సాంప్రయదాయ ఎరువు కన్నా ధర తక్కువ

రైతు సేవా కేంద్రాల ద్వారా బస్తా యూరియా ధర సుమారు రూ.267కు లభిస్తుంది. అదే బయట మార్కెట్‌లో రూ.300 నుంచి రూ.350 వరకు అమ్ముతున్నారు. దాన్ని ఇంటికి తీసుకు రావడానికి మరికొంత ఖర్చు అవుతుంది. అదే నానో యూరియా 500 మి.లీ. బాటిల్ ధర మార్కెట్‌లో రూ.270. ఎకరాకు ఒకటిన్నర బస్తా సాంప్రదాయ యూరియా అవసరం అయితే నానో యూరియా 500 మి.లీ. బాటిల్ సరిపోతుంది. ప్రభుత్వం డీఏపీ బస్తా రూ.1350కి విక్రయిస్తుండగా బయటి మార్కెట్‌లో రూ.1450 నుంచి రూ.1500 వరకు పలుకుతోంది. అదే నానో డీఏపీ లీటరు ధర రూ.570కి అమ్ముతున్నారు. సాధారణ ఎరువులు అయితే బస్తాలను మోసుకెళ్లాలి. నానో ఎరువులైతే డబ్బాను ఎక్కడికైనా చేతిలో పట్టుకుని వెళ్లిపోవచ్చు. ఎకరాకు లీటరు ద్రావణం సరిపోతుంది. అదే ఎరువును ఒక్కసారి లేదా రెండుసార్లు పిచికారి చేస్తే చాలని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు.

ఐదేళ్ల ఎమ్మెస్సీ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయం పోస్ట్‌గ్రాడ్యుయేషన్ కలాశాలలో ఎమ్మెస్సీ ఎర్త్ సైన్స్ విభాగంలో ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ అప్లైడ్ జియాలజీ కోర్సులో ప్రవేశాలు కల్పిస్తున్నట్లు సంచాలకులు టి.లక్ష్మీప్రసాద్ తెలిపారు. ఈ కోర్సుల్లో పట్టభద్రులైన వారికి మంచి ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని తెలిపారు. కోర్సులో ప్రవేశానికి ఇంటర్ ఎంపీసీ, బైపీసీలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు అర్హులన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పరిధిలోని ఏపీ మైన్స్ అండ్ జియాలజీ శాఖలో టెక్నికల్ అసిస్టెంట్, రాయల్టీ ఇన్‌స్పెక్టర్, జియాలజిస్ట్‌గా అర్హత పొందవచ్చన్నారు. ఇంకా ఏపీఎస్ఆర్ఏసీ, ఏపీఎస్ఎమ్‌డీసీ, ఏపీ గ్రౌండ్ వాటర్ బోర్డ్ వంటి సంస్థలలో అవకాశాలు లభిస్తాయన్నారు. ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించే లెక్చరర్ పోస్టులకు అర్హులన్నారు. సివిల్ ఇంజనీరింగ్ బ్రాంచ్‌లో లెక్చరర్‌గా, సెంట్రల్ గవర్నమెంట్ ఓఎన్‌జీసీ, జీఏఐఎల్, సెయిల్, కోల్ ఇండియా లిమిటెడ్, బీపీఎల్, ఇస్రో తదితర సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు పొందవచ్చన్నారు. ఆసక్తిగల విద్యార్థులు రిజిస్ట్రేషన్, ఇతర వివరాలకు 8985597928, 9985442196 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

అంతర్జాతీయ సదస్సుకు వైవీయూ ప్రొఫెసర్ జయరాజుకు ఆహ్వానం



కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయంలోని భూవిజ్ఞాశాస్త్ర విభాగంలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఎన్.జయరాజుకు యూకేలోని స్కాట్లాండ్ సెయింట్ ఆండ్రూస్ యూనివర్సిటీ నిర్వ హించనున్న అంతర్జాతీయ సదస్సులో పాల్గొనేందుకు ఆహ్వానం అందింది. ఈయన ఈనెల 19 నుంచి 22వ తేదీ వరకు జరిగే సదస్సులో భారతదేశ తూర్పు తీరంలోని కొన్ని ప్రాంతాల నుంచి సముద్ర కాలుష్యాన్ని విశ్లేషించడానికి మలస్కన్ షెల్స్ వినియోగం అనే అంశంపై పరిశోధన పత్రాన్ని సమర్పించనున్నారు. ప్రొఫెసర్ జయరాజు గతంలో 70 దేశాలలోని అంతర్జాతీయ సదస్సులలో పత్ర సమర్పణ చేశారు. ప్రొఫెసర్ జయరాజుకు అంతర్జాతీయ సదస్సుకు ఆహ్వానం అందడం పట్ల వైవీయూ వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.పద్మ, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టి.శ్రీనివాస్ అధ్యాపకులు ప్రొఫెసర్ రఘుబాబు, ప్రొఫెసర్ సునీత, సహాఆచార్యులు శ్రీనివాసగౌడ్, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

లారీ ఢీకొని యువకుడి మృతి



సునీల్‌కుమార్ మృతదేహం

చాపాడు, ఆగస్టు 18: మండ లంలోని బద్రిపల్లి బస్టాప్ వద్ద సోమవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో సునీల్‌కుమార్ (30) అనే యువకుడు మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. కేతవరం గ్రామానికి చెందిన సునీల్‌కుమార్ బైక్‌పై వెళ తుండగా లారీ వెనుక వైపు నుంచి ఢీ కొంది. దీంతో సునీల్‌కుమార్ రెండు కాళ్లు విరిగిపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని 108 వాహనంలో మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రొద్దుటూరు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

లారీ - స్కూటరు ఢీ... ఇరువురికి గాయాలు



సంఘటన స్థలంలో క్షతగాత్రులను పరామర్శిస్తున్న స్థానికులు

కమలాపురం రూరల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పందిళ్లపల్లె గ్రామ సమీపంలో సోమవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులకు గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు... మండల పరిధిలోని గంగవరం గ్రామానికి చెందిన మఠం చందు, ఖాజీపేట మండలం కొట్లూరుకు చెందిన నవీన్ కలిసి పని నిమిత్తం కమలాపురం నుంచి ఎర్రగుంట్లకు వెళుతున్నారు. పందిళ్లపల్లె గ్రామ సమీపంలోకి రాగానే అదే దారిలో వెళుతున్న కారును ఓవర్‌టేక్ చేయబోయి లారీని ఢీకొట్టారు. దీంతో ఇరువురికి గాయాలయ్యాయి. చందుకు రెండు కాళ్లు విరిగాయి. స్థానికులు 108లో కడప రిమ్స్‌కు తరలించగా ప్రథమ చికిత్స అనంతరం తిరుపతికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కూలిన మిద్దె... త్రుటిలో తప్పిన ప్రమాదం





ప్రమాదం నుంచి బయటపడిన ఓబులమ్మ

మైదుకూరు రూరల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షానికి దంతెల మిద్దె కూలింది. అదృష్టవశాత్తు ఇంట్లో నివశిస్తున్న మహిళకు త్రుటిలో ప్రమాదం తప్పింది. వివరాలిలా.. స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని పాతూరులో ఓబులమ్మ అనే మహిళ అద్దె ఇంట్లో నివసిస్తోంది. సోమవారం ఉదయం నిద్రలేచి ఇంటి పని అంతా చేసుకొని ఇంటి బయటకు రాగానే ఒక్కసారిగా ఇంటి పైకప్పు కుప్పకూలిపోయింది. దీంతో ఆమె ఎటువంటి ప్రమాదం లేకుండా బయట పడిందని స్థానికులు తెలిపారు. ఇంట్లోని సామాన్లు అన్ని మట్టి కుప్పలో కలిసిపోయి తీవ్రంగా నష్టపోయానని బాధిత మహిళ ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి ఆర్థికసాయం అందించాలని కోరుతున్నారు.

నేటితో ముగియనున్న దరఖాస్తుల స్వీకరణ గడువు

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): డి-ఫార్మసీ పూర్తి చేసిన వారికి వందశాతం ఉపాధి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్‌జ్యోతి తెలిపారు. దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 19వ తేదీతో గడువు ముగియనుందని చెప్పారు. రేషన్ కార్డు, తక్కువ ఇన్‌కమ్ కలిగిన పేద విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ సౌకర్యం కూడా ఉందన్నారు. ఇంటర్ బైపీసీ, ఎంపీసీ చేసిన విద్యార్థులు అర్హులన్నారు. పూర్తి వివరాలకు 9440144057. 9981353745. 9885355377 నెంబర్‌ను సంప్రదించాలన్నారు. అలాగే పాలిటెక్నికల్ కళాశాల వెబ్‌సైట్‌లో కూడా సమాచారం అందుబాటులో ఉంటుందని చెప్పారు.

ఆకాంక్షల జిల్లా అభివృద్ధిలో అగ్రస్థానం

● కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప కలెక్టరేట్,ఆగస్టు 18 (ఆంధ్ర జ్యోతి): రాష్ట్రంలో ఆకాంక్షల జిల్లాల అబివృద్ధిలో పార్వతీపురం, అల్లూరి సీతారామరాజు జిల్లాల కంటే మన జిల్లా అగ్రసానంలో 73.8 స్కోర్‌తో ఉందని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాల్‌లో ఆకాంక్షల జిల్లాలలో జరుగుతున్న సామాజిక, ఆర్థికాభివృద్ధి తదితర అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశంలో వెనుకబడిన జిల్లాల అభివృద్ధే లక్ష్యంగా సాగుతు న్న ప్రక్రియలో మన జిల్లాను మరింత అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకోవాలని, ఆకాంక్షల జిల్లా కార్యక్రమాలను సమర్థవంతగా అమలు చేయాలని ఆదేశించారు. ఆకాంక్ష జిల్లాల్లో జరిగే అభివృద్ధి కార్యక్రమాలను నీతి అయోగ్ పర్యవేక్షిస్తోందన్నారు. జిల్లాలో విద్య, వైద్యం, వ్యవసాయం, మౌలిక సదుపాయాలు, ఆర్థికాభివృద్ధి వంటి రంగాలపై ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతోందన్నారు. ప్రజల ఆరోగ్య సంరక్షణలో 89.6 స్కోర్‌తో 35వ ర్యాంకులో, విద్యలో 71 స్కోర్‌తో 100వ ర్యాంక్, వ్యవసాయంలో 62.9 స్కోర్‌తో 24 వ ర్యాంక్, ఆర్థికాభివృద్ధిలో 46.7 స్కోర్‌తో 71వ ర్యాంక్‌లో, మౌలిక సదుపాయాల్లో 81.7 స్కోర్‌తో 34వ ర్యాంకులో ఉన్నామన్నారు. ప్రజల ఆరోగ్య సంరక్షణలో వైద్యశాఖ విస్తృత సేవలందించాల న్నారు. ఐసీడీఎస్, డీఆర్‌డీఏ, వైద్య శాఖలు సమష్టిగా పనిచేయా లన్నారు. సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ రాజ్యలక్ష్మి, వ్యవసాయ అధికారి చంద్రానాయక్, ఉద్యానశాఖాధికారి రవిచంద్ర, సీపీవో హజరత్తయ్య, డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి, డీఎంహెచ్‌ఓ డాక్టర్ నాగరాజు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

సుఖవ్యాధులపై పరీక్షలు నిర్వహించాలి

జిల్లాలో మరింత మందికి సుఖవ్యాధులపై అవగాహన కల్పించి రక్త పరీక్షలు నిర్వహించేలా వైద్యశాఖ చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి ఆదేశించారు. సోమవారం సభాభవనంలో ఎయిడ్స్ నిర్మూలనకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ రూపొందించిన పోస్టర్లను కలెక్టర్‌తోపాటు జేసీ అదితిసింగ్, డీఆర్వో విశ్వేశ్వర నాయుడు, డీఎంహెచ్‌వో డాక్టర్ నాగరాజు, ఎయిడ్స్ కంట్రోల్ అధికారి డాక్టర్ రవికుమార్‌లు ఆవిష్కరించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆరోగ్యశాఖ సిబ్బంది, ఎన్‌జీవోలు, స్వచ్ఛంద సేవా సంస్థల సహకారంతో జిల్లాలో కళాశాలలు, పాఠశాలలు, లైన్ డిపార్ట్మెంట్స్ ప్రతి గ్రామానికి వెళ్లి హెచ్‌ఐవీ పరీక్ష, సుఖవ్యాధులపై విస్తృత ప్రచారం చేపట్టాలన్నారు. హెచ్‌ఐవీ అపోహలపై ర్యాలీలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో జడ్పీసీఈవో ఓబులమ్మ, క్లస్టర్ ప్రోగ్రామ్ అధికారి భాస్కర్ అధికారులు పాల్గొన్నారు.

చియ్యపాడు ప్రాథమిక పాఠశాలను మోడల్ స్కూల్‌గా చేయాలి



కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు

కడప మారుతీనగర్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): చాపాడు మండలం చియ్యపాడు గ్రామ హరిజనవాడలోని ప్రాథమిక పాఠశాలను మోడల్ స్కూల్‌గా చేయాలని ఎంఆర్‌పీఎస్, పీఆర్ఎస్‌వైఎఫ్, ఎస్ఎంఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఏపీ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఏపీ ఎంఆర్‌పీఎస్) ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ఆ పాఠశాల విద్యార్థులతో కలిసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఏపీ ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి బీఎస్ కర్త, రాష్ట్ర అధికార ప్రతినిధి తప్పెట హరిబాబు, కొన్నెపల్లి మునెయ్య, జిల్లా అధ్యక్షుడు తప్పెట శివ, పీఆర్ఎస్‌వైఎఫ్ జిల్లా కన్వీనర్ నాగేంద్రబాబు, ఎస్ఎంఎస్ ఛైర్మన్ సుబ్బరామాంజనేయులు మాట్లాడారు. మేజర్ పంచాయతీ అయిన చాపాడు గ్రామ దళితవాడలో దాదాపు 60 సంవత్సరాలుగా ప్రభుత్వ పాఠ శాల ఉందన్నారు. 2024-25 సంవత్సరానికి సంబంధించి పాఠ శాలలో చదువుకునే విద్యార్థులు 52 మంది వున్నారన్నారు. దీంతో ప్రభుత్వం ఆ పాఠశాలను మోడల్ స్కూల్‌గా చేసే అవకాశం ఉన్నప్పటికీ... ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలను మోడల్ స్కూల్‌గా చేయడం సరికాదన్నారు. ఆ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య కూడా చాలా తక్కువగా వుందన్నారు. ఈ విషయంపై జిల్లా విద్యాశాఖ అధికారి దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదన్నారు. ప్రభుత్వం త్వరితగతిన స్పందించి దళితవాడలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను మోడల్ స్కూల్‌గా ఏర్పాటు చేసి.. విద్యా భివృద్ధికి తోడ్పాటు అందించాలన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, ఆ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రాపర్టీ ట్యాక్స్ అవకతవకలపై తనిఖీ



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ అధికారి సంపత్‌కుమార్

మైదుకూరు రూరల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): బద్వేల్, జమ్మలమడుగు మున్సిపాలిటీలలోని బిల్డింగ్‌లకు, స్థలాలకు సంబంధించిన ప్రాపర్టీ ట్యాక్స్ అవకతవకలు జరిగాయి. దీనిపై సోమవారం మైదుకూరు మున్సిపాలిటీ కార్యాలయంలో రివ్యూ మీటింగ్ జరిగింది. ఈ మీటింగ్‌కు విజయవాడ నుంచి కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మిన్‌స్ట్రేషన్ అధికారి సంపత్‌కుమార్ విచ్చేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రంలోని పలు మున్సిపాలిటీలలోని అధికారులు ప్రాపర్టీ ట్యాక్స్ వేయడంలో అవకతకలు జరిగినట్లు రాష్ట్ర మున్సిపల్‌శాఖ మంత్రి నారాయణకు ఫిర్యాదు చేశారు. దీనిపై కడప జిల్లాలోని బద్వేలు, జమ్మలమడుగు మున్సిపాలిటీలలో థర్డు పార్టీతో ప్రాపర్టీ ట్యాక్స్‌లను సర్వే చేయించారు. ఆసర్వే నివేదికలపై మైదుకూరు మున్సిపాలిటీలో అధికారుల రివ్యూ మీటింగ్ పెట్టి రికార్డులను తనిఖీలు చేశారు. వారు ఇచ్చిన నివేదికలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని సంపత్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో బద్వేల్ కమిషనర్ నరసింహారెడ్డి, జమ్మలమడుగు కమిషనర్ వెంకటరామిరెడ్డి తదిరతులు పాల్గొన్నారు.

ఉద్యోగం పేరిట మోసం

● రూ.9లక్షలు స్వాహా
● న్యాయం చేయాలంటూ వేడుకోలు

బద్వేలుటౌన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): నా పలుకుబడి పరపతిని ఉపయోగించి.. ఉద్యోగం ఇప్పిస్తామంటూ ఓ కానిస్టేబుల్ తమ వద్ద నుంచి రూ.9లక్షలు తీసుకొని మోసం చేశాడని వెంకటరత్నమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని రాజుగారి వీధిలో తాము నివాసం ఉండేవాళ్లమన్నారు. అదే వీధిలో కానిస్టేబుల్ రవికుమార్ నివాసం ఉంటూ అర్బన్ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తుండేవారన్నారు. తమతో బాగా సాన్నిహిత్యం కనపరుస్తూ, మీ కుమార్తె గురుదేవికి ఉద్యోగం ఇప్పిస్తానంటూ నమ్మించి 2023 సంవత్సరం నవంబరు 24వ తేదీ మా వద్ద రూ.6 ల క్షలు డబ్బులు తీసుకున్నాడని, రోజులు గడుస్తున్నా మా కూతురికి ఉద్యోగం ఇప్పించలేదన్నారు. అడిగితే మరో రూ.3లక్షలు ఇస్తేనే ఉద్యోగం వస్తుందని నమ్మబలికాడని, దీంతో మా వద్ద ఉన్న నగలను కుదవపెట్టి మరో రూ.3 లక్షలు ఇచ్చామన్నారు. తీరా చూస్తే ఆ కంపెనీలో కసువు ఊడ్చే పనిలో పెట్టాడని, రూ.9లక్షలు డబ్బులు తీసుకొని ఈ పనిలో పెడతావా అని ప్రశ్నిస్తే మీ కూతురికి ఆ కంపెనీలో ఉద్యోగం లేదన్నారు. దీంతో మా డబ్బులు మాకు ఇవ్వమని అడిగితే మీకు దిక్కు ఉన్న చోట చెప్పుకోమని మమ్మలను బెదిరించాడని, అప్పటి నుంచి ఇప్పటి వరకు పోలీసు అధికారుల చుట్టూ కాళ్లు అరిగేలా తిరిగినా మాకు ఎలాంటి న్యాయం జరగలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. మాకు న్యాయం జరిగేలా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును, మంత్రిని నారా లోకేష్, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాన్‌ను కోరుతున్నామన్నారు. ఈ విషయంపై అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో పోలీసు అధికారులను వివరణ కోరగా, ఉద్యోగం ఇప్పిస్తానని మోసం చేసిన కానిస్టేబుల్ రవికుమార్‌పై కేసు నమోదు చేశామని, ప్రస్తుతం కోర్టులో విచారణ జరుగుతోందని తెలిపారు.

దానం చేయడంలోనే ఆత్మసంతృప్తి



చీరలు పంపిణీ చేస్తున్న ప్రముఖ జ్యోతిష నిపుణులు సురేష్‌బాబు దంపతులు

కడప ఎర్రముక్కపల్లె, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): దానం చేయడంలోనే ఆత్మసంతృప్తి ఉంటుందని ప్రముఖ జ్యోతిషశాస్త్ర నిపుణులు ఎం.సురేష్ బాబు తెలిపారు. సోమవారం కడపలోని ఎన్జీఓ కాలనీలో సురేష్‌బాబు కుమార్తె సుహిత శాతోన్ జన్మదినాన్ని పురస్కరించుకొని 300 మంది పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ఎందరో పేద వారు ఉన్నారని అలాంటి వారికి ఏదోక సందర్భంలో ఆదుకోవాలని సూచించారు. తమ పిల్లలకు కూడా చిన్నతనం నుంచే సహాయం చేయడం నేర్పించామని తెలిపారు. కార్యక్రమంలో నిర్మలాదేవి, సుజాత, కుసుమ, స్నేహిత పాల్గొన్నారు.

తొలగించిన దివ్యాంగుల పెన్షన్‌లను రీ వెరిఫికేషన్ చేయాలి


నిరసన తెలుపుతున్న దివ్యాంగులు, నాయకులు

కడప మారుతీనగర్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రీవెరిఫికేషన్ పేరుతో జిల్లాలో అనర్హులుగా తొలగించబడిన 7,747 దివ్యాంగుల పెన్షన్‌లను తిరిగి మరోమారు రీ వెరిఫికేషన్ చేసి పునరుద్ధరించాలని ఆంధ్రప్రదేశ్ వికలాంగుల హక్కుల పోరాట సమితి నాయకులు కోరారు. ఆ మేరకు వీహెచ్‌పీఎస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దివ్యాంగులకు ఇచ్చే పెన్షన్ తొలగించినట్లుగా నోటీసులు ఇచ్చిన వారికి న్యాయం జరిగేలా కూటమి ప్రభుత్వం త్వరితగతిన స్పందించాలన్నారు. రీ వెరిఫికేషన్ పేరుతో అర్హులైన వికలాంగులకు అన్యాయం జరిగేలా పెన్షన్ తొలగింపు చేయడం దారుణమన్నారు. కార్యక్రమంలో సమితి రాష్ట్ర నాయకుడు చిన్నసుబ్బయ్య, జిల్లా నాయకుడు మాతయ్య, పలువురు వికలాంగులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి


మాట్లాడుతున్న ఏఎస్‌ఐ శంకర్‌నాయక్

చెన్నూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఏఎస్‌ఐ శంకర్‌నాయక్ అన్నారు. స్థానిక జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు ఏప చట్టాలు ఎలా ఉంటాయి, వాటి వల్ల కలిగే ప్రయోజనాలు వాటిని కచ్చితంగా ఎందుకు తెలుసుకోవాలన్న దానిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది హెచ్‌ఎం రత్నాదేవి, పోలీసు సిబ్బంది వీరారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్లా..చెరువులా..?

● అధ్వానంగా తయారైన రహదారులు ● రోడ్లు వేసి ఆదుకోవాలని ప్రజల వినతి


నసంతపురం వద్ద దెబ్బతిన్న రోడ్డు

కమలాపురం రూరల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : కోట్ల వ్యయంతో పనులు చేపడుతున్నా గ్రామాల రోడ్లు ఇప్పటికీ అభివృద్ధికి నోచుకోవడంలేదు. చిరుజల్లులకే ఆ మార్గాలు చిత్తడిగా మారి ఇటు వాహనదారులు, రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. కమలాపురం నియోజకవర్గంలో గత వైసీపీ ప్రభుత్వంలో కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టారు. ఇందులో ఏ ఒక్క రోడ్డునూ పట్టించుకుని అభివృద్ధి చేసిన దాఖలాలు లేవు. రైతాంగం నుంచి పన్నులు, సెస్ రూపంలో అధికారులు కోట్లలో డబ్బులు వసూలు చేస్తున్నారే తప్ప వారి అభివృద్ధికి సరైన మార్గాలు నిర్మించి ఇవ్వలేకపోతున్నారు. రైతులు పొలాల వద్దకు వెళ్లేందుకు అవస్థలు పడుతున్నారు. గత ప్రభుత్వం యంత్రాంగం రోడ్ల అభివృద్ధిని పట్టించుకోకపోయినా ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం అయినా స్పందించి రైతుల రవాణాకు అత్యవసరమైన రహదారులను వెంటనే అభివృద్ధి చేసి ఇవ్వాలని పలువురు కోరుతున్నారు. నియోజకవర్గంలో కమలాపురం మార్కెట్‌యార్డు రైతాంగం సేవలో ఉంది. ఇక్కడ వ్యవసాయ మార్కెటింగ్ కమిటీలున్నాయి. వీటి పరిధిలో నిధులు పుష్కలంగా ఉండి ఈ మార్కెట్‌యార్డు జిల్లాలోని ప్రధాన స్థానం ఉంది. కొంత నిధులను తక్షణమే రోడ్ల అభివృద్ధికి మంజూరు చేయాలి.


వెంకటాపురం, పొడదుర్తి మధ్య చెరువును తలపిస్తున్న రహదారి


నగర పంచాయతీ పరిధిలో గుంతలతో ఉన్న రోడ్డు

కమలా పురం మండల పరిధిలో 18 గ్రామ పంచాయతీలున్నాయి. ఆయా గ్రామాల మధ్య రోడ్డులో ఉన్నాయి. ఇందులో అతి ముఖ్యమైన వి ఎర్రబల్లె శివారు కొత్తపల్లె నుంచి చిన్నచెప్పలి వరకు సుమారు 10 కి.మీ మేర రోడ్డు ఉంది. ప్రస్తుతం ఇక్కడ పనులు సాగుతున్నా ఎప్పటికి పూర్తి అవుతాయో తెలియదు. ఈ రెండు మార్గాల మధ్య రెవెన్యూ గ్రామాల పరిధిలో రైతులకు అత్యంత అవశ్యకత మార్గలుగా వినియోగంలో ఉన్నాయి. ఈ మార్గాలకు సుమారు దశాబ్దకాలం క్రితం తాత్కాలిక గ్రావెల్ మార్గంగా నిర్మించారు. అనతి కాలంలోనే కురిసిన వర్షాలకు ఆ గ్రావెల్ కాస్త కొట్టుకుపోయి మట్టితో నిండి చిత్తడిగా మారింది. ఇలా అధ్వాన స్థితిలో ఈ ప్రాంతంలో నసంతపురం, లేటపల్లె, వెంకటాపురం, పొడదుర్తి గ్రామాలున్నాయి. ఈ ప్రాంతంలో ప్రతిరోజూ వందలాది వాహనాలు తిరుగుతుంటాయి. ఈ ప్రాంతం వీఎన్‌పల్లె మండలాన్ని కూడా దగ్గర దారి కావడంతో ఈ రహదారి మార్గంలో ప్రసిద్ధి చెందిన శ్రీసంగమేశ్వరస్వామి ఆలయం కూడా ఉండడంతో ఈ మండల ప్రజలు ఈ మార్గం ద్వారా వెళుతుంటారు. ఇకనైనా అధికార యంత్రాంగం ప్రత్యేకదృష్టి సారించాలని గుంతల రోడ్లు అభివృద్ధి చేసిప్రజలకు న్యాయం చేయాలని పలువురు కోరుతున్నారు.

22న కమనీయ కవితలు పుస్తకావిష్కరణ

కడప కల్చరల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): నగర సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో ఈనెల 22వ తేదీ శుక్రవారం సాయంత్రం 4 గంటలకు జి.ఎల్. లావణ్య రచించిన కమనీయ కవితలు అనే పుస్తకాన్ని జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో ఆవిష్కరించనున్నట్లు ఆ సంఘం అధ్యక్షుడు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి తెలిపారు. ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విశ్రాంత జిల్లా సెసెన్స్ న్యాయవాది షేక్ మొహమ్మద్ ఇస్మాయిల్, పలువురు వైద్యులు, రచయితలు, హాజరుకానున్నట్లు వెల్లడించారు. కవులు, రచయితలు, ప్రజలు హాజరుకావాలని కోరారు.

మత్తుతో జీవితం నాశనం

సీకేదిన్నె, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మత్తుపదార్థాలకు అలవాటుపడితే జీవితాలు నాశనం అవుతాయని ఈగల్‌టీం సభ్యుడు ఆయూబ్‌ఖాన్ తెలిపారు. చింతకొమ్మదిన్నె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు డ్రగ్స్ వ్యతిరేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో డ్రగ్స్ నివారణలో భాగస్వాములు కావాలని ప్రతిజ్ఞ చేయించారు.

వైవీయూ అభివృద్ధికి సహకరించండి

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయ అభివృద్ధికి సహకరించాలని ఆర్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డీఎం ఓబులేసు యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం వైవీయూ ఆర్ట్స్ బిల్డింగ్ వద్ద విద్యార్థులతో కలిసి కరపత్రాలు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎఫ్ యూనివర్సిటీ అధ్యక్షుడు కె.నరసింహ, సభ్యులు మోహన్, పవన్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టిప్పర్లతో రోడ్లన్నీ నాశనం

కమలాపురంరూరల్. ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఆర్‌అండ్‌బీ పంచాయతీరాజ్ రోడ్లన్నీ దెబ్బతిని ప్రయాణికులకు తీవ్ర అంతరాయం కలుగుతోందని, గర్భిణీలు పొరపాటున ఆటోలో వస్తే దారిలోనే ప్రసవించే ప్రమాదం ఉందని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర అన్నారు. సోమవారం స్థానిక చిన్నచెప్పలిలో దెబ్బతిన్న రోడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో రోడ్లన్నీ ధ్వంసం అయ్యాయని, కల్వర్టులో బ్రిడ్జిలు కొట్టుకుపోయాయని, మరమ్మతులకు కూడా నిధులు లేమితనం వెంటాడుతోందని అన్నారు. సమావేశంలో సీపీఐ కమలాపురం ఏరియా కార్యద ర్శి నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

హామీల అమలుకు కృషిచేయండి


వినతిపత్రం సమర్పిస్తున్న యూటీఎఫ్ ప్రతినిధులు

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు కృషిచేయాలని యూటీఎఫ్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. సోమవారం ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి నివాసంలో ఆయనను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయ కుమార్, పాలెం మహేష్‌బాబు, జిల్లా కార్యదర్శి చెరుకూరి శ్రీనివాసులు, దేవదత్తం, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

'నీటి ట్యాంకులు శుభ్రపరచండి'

వేంపల్లె, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె పంచాయతీ పరిధిలో తాగునీటిని అందించే నీటి ట్యాంకులను శుభ్రపరచడం లేదని మాజీ ఎంపీపీ గోగుల కొండయ్య తెలిపారు. ట్యాంకుల్లో బ్లీచింగ్ పౌడర్ వేసి శుభ్రం చేసే పరిస్థితి లేదన్నారు. పట్టణమంతా పాపాఘ్ని నది, బోర్ల నుంచి పంచాయతీ నీటిని సరఫరా చేస్తోందన్నారు. ట్యాంకుల్లో అపరిశుభ్రత, పాచి ఉందని అధికారులు పర్యవేక్షించడం లేదు, సిబ్బంది ట్యాంకులను శుభ్రం చేయడం లేదని తెలిపారు.

ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తాం

టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి


గడ్డంవారిపల్లె సొసైటీ అధ్యక్షుడు రామిరెడ్డి సూర్యనారాయణరెడ్డి, పాలక వర్గ సభ్యులను సత్కరిస్తున్న పుత్తా నరసింహారెడ్డి

వీరపునాయునిపల్లె, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): సర్వరాయసాగర్ రిజర్వాయర్ ద్వారా కాల్వల పనులు పూర్తయితే వీరపునాయునిపల్లె, కమలాపురం మండలాల్లో ప్రతి ఎకరాకు సాగునీరు, తాగునీరు అందిస్తామని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి అన్నారు. సోమవారం గడ్డంవారిపల్లె సొసైటీలో నూతనంగా ఎన్నికైన గడ్డంవారిపల్లె సొసైటీ అధ్యక్షుడు రామిరెడ్డి సూర్యనారాయణరెడ్డి, పాలక వర్గ సభ్యులు రామలక్ష్మిరెడ్డి, సింగం రామకృష్ణారెడ్డిలతో సంఘ సొసైటీ సూపర్‌వైజర్ వీరశేఖర్ ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా పుత్తా నరసింహారెడ్డి మాట్లాడుతూ రైతుల కోసం జీఎన్ఎస్ఎస్ కాల్వ పూర్తిచేస్తే నియోజకవర్గం బాగుపడుతుందన్నారు. కొన్ని కారణాల వలన పూర్తిచేయలేకపోయారని గత ప్రభుత్వం సర్వరాయసాగర్ పట్టించుకున్న దాఖలాలు కనిపించడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ బైరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, మండల రైతు సంఘం అధ్యక్షుడు రామచంద్రశేఖర్‌రెడ్డి, సొసైటీ అధ్యక్షుడు రమణారెడ్డి, కమలాపురం మార్కెట్ యార్డు ఛైర్మన్ రాఘవరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు వాసుదేవరెడ్డి, మల్లు గోపాల్‌రెడ్డి, పాయసంపల్లె శ్రీనివాసులరెడ్డి, తలపనూరు గంగిరెడ్డి పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత


బురదను తొలగిస్తున్న సిబ్బంది

పెండ్లిమర్రి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి):తమ చుట్టూ ఉన్న పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యతని ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి తెలిపారు,మండల పరిధిలోని తుమ్మలూరు పంచాయతీలో గల గోపరాజుపల్లె గ్రామంలో సోమవారం ఎస్ఐ ఆధ్వర్యంలో బురదను ఎక్స్‌కవేటర్‌తో తొలగించారు. చాలా గ్రామాలలో వర్గ పోరు ఉండటంతో బురదను తొలగించేందుకు అడ్డంకులు ఉండేవి.దీంతో ఎస్ఐ రంగంలోకి దిగి గ్రామస్తులతో మాట్లాడి వర్షాలు పడుతున్నందున విషజ్వరాలు వస్తాయని కావున పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అన్నారు.పారిశుధ్యం... అధ్వానం ..అనే కథనం రావడంతో స్పందించిన నాయకులు అధికారులు.ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు ఈశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలి

జిల్లా చిరంజీవి యువత అధ్యక్షుడు పంద్రా రంజిత్‌కుమార్


రక్తదాన శిబిరంలో జనసేన నాయకుడు రంజిత్‌కుమార్

కడప ఎర్రముక్కపల్లె, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ రక్తదానం చేసిరక్త కొరతను అరికట్టాలని జిల్లా చిరంజీవి యువత అధ్యక్షుడు పంద్రా రంజిత్‌కుమార్ పిలుపునిచ్చారు. సోమవారం కడప ఇండియన్ రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్‌లో మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా సేవా కార్యక్రమాల వారోత్సవాలలో భాగంగా మూడో కార్యక్రమం మెగా రక్తదాన శిబిరం కార్యక్రమాన్ని చేపట్టారు. మెగా అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారికి తలసేమియావ్యాధితో బాధపడుతున్న వారికి రక్తదానం చాలా అవసరం అని అటువంటి వారిని ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ రక్తదానం చేయడానికి ముందుకురావాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో రక్త కొరత అధిగమించడానికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలదాసు నాగరాజు, బ్రహ్మంనాయక్, గౌస్‌లాజం,బాలునాయక్,చైతన్య,అతికారి నాగేంద్ర, కుమార్‌నాయక్,సుధీర్, శ్రీను, వెంకట్, మల్లికార్జున, గోపాల్‌నాయక్, సాయినాయక్, విశాల్ దేవ్,రామ్‌చరణ్, హర్షవర్ధన్, లోకేష్, రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్ డాక్టర్ యశస్వినిరెడ్డి, సిబ్బంది స్వరూపారాణి, ప్రశాంతి పాల్గొన్నారు.

వీఆర్‌ఏలతో ఉద్యోగాలను భర్తీచేయాలి

కడప సెవెన్ రోడ్స్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిధిలో ఉన్న తహసీల్దార్ కార్యాలయాల్లో ఖాళీగా ఉన్న అటెండర్, వాచ్‌మెన్, రికార్డ్ అసిస్టెంట్ పోస్టులను అర్హులైన వీఆర్‌ఏలతో భర్తీ చేయాలని ఏపీ వీఆర్‌ఏ వెల్ఫేర్ అండ్ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్రప్రధాన కార్యదర్శి కొమ్మద్ది ఈశ్వరయ్య విజ్ఞప్తి చేశారు. వీఆర్‌ఏ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కోడూరు పుల్లయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు సి.మణికుమార్‌లతో కలిసి కడపలో వీఆర్‌ఏ అసోసియేషన్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈశ్వరయ్య మాట్లాడుతూ చాలా సంవత్సరాల నుంచి తహసీల్దార్ కార్యాలయాల్లో పోస్టులు ఖాళీగా ఉండడం వలన వీఆర్‌ఏలతో అనధికారికంగా డ్యూటీలు చేయిస్తున్నారని తెలిపారు. ఈ విషయం జిల్లా అధికారులకు విన్నవించామని తెలిపారు.

విజయస్థూపాన్ని కాపాడండి

కడప నాగరాజుపేట, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): కడప నగరపాలక పాత మున్సిపాలిటీ కార్యాలయం వద్ద ఉన్న విజయస్థూపాన్ని కాపాడాలని జనంకోసం సేవా సాంస్కృతిక విద్యా క్రీడ రాష్ట్ర అధ్యక్షుడు పఠాన్ ఖాదర్‌బాష అన్నారు. పాత మున్సిపల్ కార్యాలయ ఆవరణంలో ఉన్న విజయస్థూపానికి 60ఏళ్లు పూర్తయిన శుభసందర్భంగా సోమవారం స్థూపానికి పూలమాల వేశారు. ఆయన మాట్లాడుతూ 60 ఏళ్లు పూర్తిచేసుకున్న వియస్థూపాన్ని ప్రస్తుతం డంపింగ్‌యార్డ్, చెత్తాచెదారం బండ్ల మధ్య ఉండడం చాలాబాధాకరమైన విషయమని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో పర్యాటక అభిమానులు పాల్గొన్నారు.

'ప్రజల పక్షానే ప్రతిపక్షం పోరాటం'

కడప ఎర్రముక్కపల్లె, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ప్రజలపక్షాన ఉంటూ ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రతిపక్షం ఎప్పుడు పోరాడుతుందని వైసీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. ఆ పోరాటాల ఫలితం ద్వారానే కొంతమంది ప్రజలకైన సక్షేమ ఫలాలు లభించాయని చెప్పారు. సోమవారం కడపలోని వైసీపీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలన్నీ అమలు చేసే మమ్మల్ని ఎవరు ఏమీ అనకూడదని కూటమి ప్రభుత్వం చెప్పడం హాస్యాస్పదంగా ఉదన్నారు. వైసీపీ చేసిన ఉద్యమాల వల్ల ఏదో కొన్ని ఇచ్చి డబ్బా కొట్టుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జ్వరాలపై అప్రమత్తంగా ఉండండి


పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న దృశ్యం

వేంపల్లె, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఎం ఖాజా మొహిద్దీన్, జిల్లా అసిస్టెంట్ మలేరియా అధికారి వెంకటరెడ్డి తెలిపారు. వేంపల్లె శ్రీరామ్ నగర్‌లో పర్యటించారు. ఆశా వర్కర్ల ఫీవర్ సర్వేను తనిఖీచేశారు. దోమల నివారణకు మందులు పిచికారీ చేశారు. అనంతరం ప్రభుత్వ వైద్యశాలను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. వైద్య సిబ్బందితో సమీక్ష చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఖాజామొయినుద్దీన్, మలేరియా అధికారి సిద్దయ్య, డాక్టర్లు నిహారిక, సునీత, సుశాంతి, హెల్త్‌ఈ షఫిఉన్నీస పాల్గొన్నారు.

ఎక్సైజ్ కార్యాలయం ముందు నిలిచిన వర్షంనీరు



కడప క్రైం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : కడప నగరం ప్రకాశ్‌నగర్‌లోని ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయం వద్ద వర్షం నీరు నిలచింది. సరైన కాల్వలు లేకపోవడం, రోడ్లపై నిలబడిన వర్షం నీరు వెళ్లేందుకు వీలుగా లేకపోవడంతో చిన్నపాటివర్షం నిలబడింది. ఎక్సైజ్ సిబ్బంది, ఆ కార్యాలయానికి వచ్చేవారు కాస్త ఆదమరిస్తే నీళ్లలో పడాల్సిన పరిస్థితి ఉంది. కార్పొరేషన్ అధికారులు స్పందించి రోడ్లపై నిలబడ్డ వర్షంనీరును పారేలా చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

వేల్పుల సొసైటీ అధ్యక్షుడుగా సుధాకర్‌రెడ్డి బాధ్యతలు స్వీకరణ



వేముల, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): వేల్పుల సింగిల్ విండో సొసైటీ అధ్యక్షుడుగా రాగిపిండి సుధాకర్‌రెడ్డి నియామకం అయ్యారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన బాధ్యతలు చేపట్టారు. అధ్యక్షులుగా రాగిపిండి సుధాకర్‌రెడ్డి, సభ్యులుగా గండు ఓబులేసు, తులిసి ఆకు రాములు నియామకమై బాధ్యతలు చేపట్టారు.

మురుగులో మున్నెల్లిరాజుపాలెం

● రాజకీయ ఉద్దండులు కలిగిన ఆ గ్రామంలో అధ్వానంగా రోడ్లు ● పారిశుధ్య లోపం, గుంతల రోడ్లు దర్శనమిస్తున్న వైనం

బి.కోడూరు. ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : మురుగులో మున్నెల్లి గ్రామం కొట్టు మిట్టాడుతోంది ఆ గ్రామంలో ఒకప్పుడు జిల్లారాజకీయాలు శాసించిన వారు ఉన్నారు. ఒకప్పుడు అప్పటి ఎమ్మెల్యే చిదానందం, తర్వాత శివరామక్రిష్ణారా వుకు ముఖ్య అనుచరులు. బద్వేలు మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, టీడీపీ ఇన్‌చార్జి రితీష్‌రెడ్డి. ముఖ్య అనుచరులతోపాటు ఎమ్మెల్సీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే సుధాకు అనుచరులు ఈ గ్రామంలోనే ఉన్నారు. అంతే కాకుండా ప్రస్తుత రాష్ట్ర రైతు విభాగం అధ్యక్షుడు కూడా ఈ గ్రామానికి చెందినవారే. అదే బికోడూరు మండలం మున్నెల్లి రాజుపాలెం గ్రామం. ఈ గ్రామంలో దాదాపు 400 కుటుంబాలు,1100 మంది జనాభా ఉన్నారు. కొంతమంది మాత్రమే వ్యవసాయం, పాడి పరిశ్రమ మీద ఆధారపడి జీవిస్తుంటారు. ఆ గ్రామంలో 2వేలకు పైగా పశువులుఉంటాయి. గ్రామంలో ఒకే ఒక్క వీధి రోడ్డు ఉండగా మిగతా వీధులన్నీ సందులు గొందుల రోడ్లే. ఆ గ్రామంలో జనాభా, పశువులు ఎక్కువగా ఉండడంతో వీధుల గుండా మురుగుపారుతుంటుంది. వర్షాకాలం వచ్చిందంటే మండలంలో అన్ని గ్రామాలు ఒక ఎత్తయితే ఆ గ్రామంలో ఎక్కువగా రోగాలు విష జ్వరాలు వస్తుంటాయి. దోమలు అధికంగా ఉంటాయి సిమెంటు రోడ్లు ఏర్పాటు చేసి డ్రైనేజీ నిర్మిస్తే సమస్య పరిష్కారమవుతుందని గ్రామస్థులంటున్నారు. అధికారులు స్పందించి సిమెంటు రోడ్డు, డ్రైనేజీ ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.



మున్నెల్లిరాజుపాలెంలో రోడ్డుపై నిలిచిన మురుగునీరు, పక్కన చెత్తకుప్పలు

ఎంపీడీవో ఏమన్నారంటే: ఈ విషయమై ఎంపీడీవో భాస్కర్‌రావును 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా గ్రామంలో రోడ్లపై మురుగునీరు నిల్వ, ఉన్న మాట వాస్తవమేనన్నారు. అయితే రోడ్లు డ్రైనేజీ ఏర్పాటు చేసేందుకు పంచా యతీరాజ్ ఏఈని ఉన్నతాధికారులకు నివేదిక పంపమని చెప్పామన్నారు. కాగా పంచాయతీరాజ్ ఏఈ నారాయణరెడ్డి మాట్లాడుతూ గ్రామంలో గతంలో సిమెంటు రోడ్డు వేశారని, అది పూర్తిగా దెబ్బతిని గుంతలు ఏర్పడ డంతో ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. ఈవిషయమై జిల్లా అధికారులకు నివే దిక కూడా పంపించామని నిధులు మంజూరు చేసిన వెంటనే ఆ గ్రామంలో సిమెంటు రోడ్డు, డ్రైనేజీ ఏర్పాటు చేస్తామని తెలిపారు.

నిధులు రాకనే సమస్యలు: గ్రామ పంచాయతీకి ఎలాంటి నిధులు రాలే దని సొంత గ్రామంలో కూడా తాను ఏమీ చేయలేని పరిస్థితి ఏర్పడిందని, స్థానిక సర్పంచ్ గురయ్యపేర్కొన్నారు. నిధులు వచ్చిన వెంటనే గ్రామంలో సమస్య లు పరిష్కరిస్తానని ఆయన తెలిపారు.

శాంతి భద్రతలపై ప్రత్యేక దృష్టి

ఎర్రగుంట్ల, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్లలో శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి పెడతామని సీఐ విశ్వనాథరెడ్డి తెలిపారు. ఎర్రగుంట్ల అర్బన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా విశ్వనాథరెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతామన్నారు. ట్రాఫిక్‌పై చర్యలు తీసుకుంటామన్నారు. సీఐగా బాధ్యతలు చేపట్టిన ఆయన్ను ఎస్‌ఐ నాగమురళి, ఇతర సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన ఉన్నతాధికారులను కలిసేందుకు జమ్మలమడుగు, కడపకు వెళ్లారు.

జమ్మలమడుగు అర్బన్ సీఐగా నరేష్‌బాబు



జమ్మలమడుగు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు అర్బన్ సీఐగా నరేష్‌బాబు సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. ఈయన జమ్మలమడుగు నియోజకవర్గంలోని ఎర్రగుంట్ల మండలం నుంచి బదిలీపై జమ్మలమడుగు అర్బన్ పోలీసు స్టేషన్‌కు వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం డీఎస్పీ కార్యాలయం చేరుకుని అక్కడి నుంచి జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్‌ను కలిశారు. ఇప్పటి వరకు జమ్మలమడుగులో పనిచేసిన సీఐ లింగప్ప బద్వేలుకు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా కొత్తగా వచ్చిన సీఐ నరేష్‌బాబు మాట్లాడుతూ జమ్మలమడుగులో అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కొండాపురం సీఐగా రాజా బాధ్యతల స్వీకరణ



కొండాపురం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): కొండాపురం సీఐగా రాజా సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన రాజంపేట నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు తనవంతు కృషిచేస్తానన్నారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు.

అన్నదాత సుఖీభవ రైతులకు గడువుపెంపు

మైదుకూరు రూరల్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి) : అన్నదాత సుఖీభవ రైతులు పట్టదారు ఆధార్‌సీడింగ్, అప్లికేషన్ పెండిగ్ తదితర సమస్యలకు అర్జీ పెట్టుకోవడానికి ఆగస్టు 20వ తేది వరకు గడువు ఉందని మండల వ్యవసాయాధికారి బాలగంగాధర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ రైతులు వారి సమస్యలను దగ్గరలోని రైతు సేవా కేంద్రంలో సంప్రదించాలని తెలిపారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

బ్రహ్మంగారిమఠం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మంగారిమఠం మండలంలో విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు తహసీల్దారుకు వినతిపత్రం ద్వారా విన్నవించారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు అజయ్ మాట్లాడుతూ బ్రహ్మంగారిమఠంలో నరసన్నపల్లె ఎంపీపీ పాఠశాలలో నాడు- నేడు కొద్దిపాటి పనులు చేశారన్నారు. దీంతో పాఠశాల ఆవరణలో వర్షం నీరు చేరి విద్యార్థులకు ఇబ్బంది కలిగించే విధంగా ఉందన్నారు. మండల అధ్యక్ష కార్యదర్శులు అరవింద్, రాజశేఖర్, ఉపాధ్యక్షుడు రమేశ్‌లు పాల్గొన్నారు.



జేవీవీ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): జనవిజ్ఞాన వేదిక పట్టణ నూతన కార్యవర్గంను ఎన్నుకున్నారు. నూతన కమిటీ అధ్యక్షుడుగా వేంపల్లె రాజశేఖర్, ప్రధాన కార్యదర్శిగా నంగా రాజేష్, కోశాధికారిగా డాక్టర్ చక్రధర్, సమత విభాగం కన్వీనర్‌గా రాజ్యలక్ష్మిలను, ఉపాధ్యక్షులుగా ఉషారాణి, ఈశ్వరయ్య, డాక్టర్ దస్తగిరి, హేమంత్, గఫార్, ప్రసన్నకుమార్, కార్యదర్శులుగా సునీత, బాలసుందర్, మహేష్, మహిత, జయసింహ, పవన్, గౌరవాధ్యక్షుడు డాక్టర్ నరసింహారెడ్డి, గౌరవ సలహాదారులు సూర్యనారాయణరెడ్డి, గోపీనాధరెడ్డి, చంద్రశేఖర్‌లను ఎన్నుకున్నారు.

పేదల కాలనీలో డోర్‌నెంబరు వేయాలి

బద్వేలు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): పేదల కాలనీలో నివాసమున్న ప్రతి ఇంటికి డోరు నెంబర్లు వేయాలంటూ మున్సిపల్ కార్యాలయం ఎదుట సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా చేశారు. అంతకుముందు ప్రజా సమస్యల పరిష్కారం కోరుతూ మార్కెట్‌యార్డు నుంచి ర్యాలీగా మున్సిపల్ కార్యాలయం వరకు వచ్చి అనంతరం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు జి.శివకుమార్ మాట్లాడుతూ పట్టణ శివారు ప్రాంతాలైన సుందరయ్య కాలనీ,ఐలమ్మ కాలనీ, జ్యోతిబసు కాలనీలలో నివాసం ఉంటున్న గృహాలకు డోరు నెంబర్లు కల్పించాలన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి పేదల పాలిట వరం

జమ్మలమడుగు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయనిధి పేదల పాలిట వరమని జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి అన్నారు. సోమవారం జమ్మలమడుగు టీడీపీ కార్యాలయంలో సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు భూపేశ్‌రెడ్డి అందజేశారు. ఈ పథకం కింద 26 మంది లబ్ధిదారులకు రూ. 8,92,029 సహాయ నిధి చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పెద్దముడియం మండలం మండల కన్వీనర్ శ్రీనివాసులరెడ్డి, పొన్నతోట మల్లికార్జున, శ్రీనివాసులు, సర్పంచ్ రంగనాయకులు, తదితర లబ్ధిదారులు పాల్గొన్నారు.

డ్రైనేజీ కాల్వలు పునరుద్ధరించండి

పోరుమామిళ్ల, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) :డ్రైనేజీ కాలవలు పునరుద్ధరించి మురుగునీరు రాకుండా ప్రజలను కాపాడాలని ఉద్దికట్టవాసులు కోరుతున్నారు. గత రెండురోజులుగా కురిసిన వర్షాలకు పోరుమామిళ్లలోని ఉద్దికట్ట వీధిలో డ్రైనేజీ రావడంతో ఆ దుర్గంధం భరించలేక నీరు వెళ్లే దారి లేక ఆ వీధివాసులు ఇబ్బందులకు గురవుతున్నారు. దాదాపు వంద కుటుంబాలకు పైగా నివాసం ఉంటున్న ఆ వీధిలో డ్రైనేజీ అస్తవ్యస్తంగా ఉండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి మురుగునీరు మళ్లించే చర్యలు చేపట్టి నీరు కలుషితం కాకుండా ,చూడాలని ఆ వీధి మహిళలు కోరుతున్నారు.

ఘనంగా శ్రీకృష్ణభగవానుడి గ్రామోత్సవం

ముద్దనూరు ఆగస్టు18(ఆంధ్రజ్యోతి):మండల పరిధిలోని ఉప్పలూరు లో సోమవారం కృష్ణాష్టమి పురస్కరించుకొని శ్రీకృష్ణభగవానుని ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. త్రైత సిద్ధాంత ప్రబోధన సేవా సమితి, హిందూ జ్ఞానవేదిక ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. పురవీధుల్లో అంగరంగ వైభవంగా శ్రీకృష్ణ ప్రతిమను ఊరేగించారు.

వైభవంగా కృష్ణాష్టమి ఉత్సవాలు

బద్వేలుటౌన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని శ్రీకృష్ణ మందిరంలో మూడు రోజులుగా కృష్ణాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఉట్టికొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ నాగభూషణం, ఎస్‌ఐలు సత్యనారాయణ, శ్రీకాంత్‌లు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు వెంగల్‌రెడ్డిలు ఉట్టికొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం గెలుపొందిన విజేతలకు వారి చేతుల మీదుగా బహుమతులను అందజేశారు.

నర్సాపురం హైస్కూల్లో జ్ఞానసరస్వతీ విగ్రహ ప్రతిష్ఠ



కాశినాయన ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి):నర్సాపురం జడ్పీ ఉన్నతపాఠశాలలో సోమవారం జ్ఞానసరస్వతీ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఘనంగా నిర్వహిం చారు. పురోహితుల వేద మంత్రోచ్చారణలు, హో మాలు మంగళవాయిద్యాల నడుమ సరస్వతీ విగ్రహ ప్రతిష్ఠ అట్టహాసంగా సాగింది. మొదట నర్సాపురంలో గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. 1990-91 విద్యా సంవత్సరానికి చెందిన పూర్వ విద్యార్థులు పాఠశాల ఆవరణలో సరస్వతీ విగ్రహం ప్రతిష్ఠించడంతో పాటు నాటి ఉపాధ్యాయులను సన్మానించి అన్నదానం చేశారు. కార్యక్రమంలో విద్యార్థులు వారితల్లిదండ్రులు ఉపాధ్యాయులు పూర్వ విద్యార్థుల కుటుంబాలు నర్సాపురం గ్రామస్థులు పాల్గొన్నారు.

కాంట్రాక్టర్లకు రూ,17 కోట్ల బిల్లులు చెల్లించాలి

ప్రొద్దుటూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి):ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధిలో చేసిన అభివృద్ధి పనులకు సంబంధించి గత ఏడాది కాలంగారూ.17కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని కాంట్రాక్టర్లు పేర్కొన్నారు. ఆమేరకు వారు సోమవారం మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. బిల్లులు రాకపోవడంతో అప్పులకు తెచ్చిన వడ్డీలు కట్టుకుంటూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వారు కమిషనర్‌కు విన్నవించారు. కమిషనర్‌ను కలిసిన వారిలో కృష్ణార్జునరెడ్డి, కొల్లేటి సుబ్బారెడ్డి, సందీప్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, బంగారు బాబుల్‌రెడ్డి, కాజా శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

చిన్నారులకు స్పెషల్ డ్రైవ్ టీకాలు




టీకా స్పెషల్ డ్రైవ్‌ను పరిశీలిస్తున్న వైద్యాధికారి హనీఫ్‌బాబా

ప్రొద్దుటూరు రూరల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): పిల్లల్లో డిప్తీరియా, కోరింత దగ్గు, ధనుర్వాతం వంటి బ్యాక్టీరియాల వలన కలిగే అనారోగ్యాలను అరికట్టేందుకు స్పెషల్ డ్రైవ్ ద్వారా టీకాలను వేస్తున్నట్లు కామనూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ హనీఫ్‌బాబా పేర్కొన్నారు. సోమవారం కామనూరు పీహెచ్‌సీలో నేటి నుంచి ఈనెల 23వ తేదీ వరకు అన్ని ప్రభుత్వ, ప్రైవేటు, ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో 5 నుంచి 7 సంవత్సరాల పిల్లలకు డీపీటీ టీకా, 10 నుంచి 16 ఏళ్ల వయస్సుగల పిల్లలకు టీడీ టీకాను ఆరోగ్య సిబ్బంది ఉచితంగా వేస్తారని తెలిపారు. ఈ స్పెషల్ డ్రైవ్‌లో అంగన్వాడీ టీచర్లు, పాఠశాల ఉపాధ్యాయులు, సహకరించి విజయవంతం చేయాలని వైద్యాధికారి కోరారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో క్రిష్ణమ్మ, సూపర్‌వైజర్ బిఏ వరప్రసాద్, ఆరోగ్య సిబ్బంది జాస్మిన్, హేమ, ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

మాతృభాషను గౌరవించండి

బద్వేలు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మాతృభాషను గౌరవించాలని ఆంధ్రప్రదేశ్ తెలుగుభాష వికాస ఉద్యమ జిల్లా అధ్యక్షుడు హనుమంతరావు పేర్కొన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యాలయంలో తెలుగు భాష సదస్సు నిర్వహించారు. తొలుత తెలుగు భాషాభివృద్ధికి పాటుపడిన గిడుగు వెంకట రామమూర్తి పంతులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం తెలుగులోనే సంతకాలు, ఉత్తర ప్రత్యుత్తరాలు రాస్తామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. తెలుగుభాషపై ప్రేమను పెంపొందించేందుకు ప్రతి పాఠశాలలో పద్యపఠన, వక్తృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం బద్వేలు శాఖ అధ్యక్షుడు ఎద్దుల రామసుబ్బారెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ ముండ్లపాటి పిచ్చయ్య, కొండయ్య, కొండయ్య, శ్రీరాములు మొల్ల సాహితీపీఠం ప్రధాన కార్యదర్శి మనోజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలను పెంచండి : డీఎల్‌డీవో



ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో డీఎల్‌డీవో

ఎర్రగుంట్ల, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): మండలంలో ఉపాధి కూలీలను పెంచాలని జమ్మలమడుగు డివిజినల్ డెవలప్‌మెంట్ అధికారి వి.రామాంజనేయులు అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన ఎర్రగుంట్ల ఎంపీడీవో కార్యాలయాన్ని సందర్శించి మండలంలో జరుగుతున్న ఉపాధిపనులపై చర్చించారు. కూలీలు తక్కువగా వస్తుండటంపై ఆయన ఆరా తీశారు. కూలీలను పెంచండని ఆదేశించారు. సచివాలయాలపై ఆరా తీశారు. కార్యాలయాలు ఎక్కడెక్కడున్నది అడిగితెలుసుకున్నారు. ఎంపీడీవో వెంకటరమణ, ఏవో త్రిమూర్తిరెడ్డి, ఏపీవో గంగాదేవి పాల్గొన్నారు.

గ్రామాల్లో సమస్యలపై దృష్టి సారించండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో రామచంద్రారెడ్డి

మైలవరం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో అధికారులు సమస్యలపై దృష్టి సారించాలని ఎంపీడీవో రామచంద్రారెడ్డి సూచించారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాల్లో నీటి సమస్య, పరిసరాల పరిశుభ్రత తదితర వాటిపై దృష్టి సారించి ఎప్పటికప్పుడు సమస్యలను పరిష్కరించాలన్నారు. గ్రామాల్లో పారిశుద్యానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అన్నదాత సుఖీభవ పథకానికి అర్హత సాధించలేకపోయినవారు ఈ నెల 20లోపల గ్రామస్థాయిలోని రైతు సేవా కేంద్రాల్లో వినతులు ఇచ్చి పరిష్కరించుకోవాలన్నారు. తహసీల్దారు లక్ష్మినారాయణ, ఏవో గురుభాస్కర్, మండల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉచిత బస్సు.. మహిళలు ఫుల్



జమ్మలమడుగులో ఆర్టీసీ బస్సు ఎక్కడానికి వెళుతున్న మహిళలు

జమ్మలమడుగు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగులో ఆర్టీసీ ఉచిత బస్సు సౌకర్యానికి రోజు రోజుకు మహి ళల నుంచి విశేష ఆదరణ లభిస్తోంది. జమ్మలమడుగు ఆర్టీసీ డిపో నుంచి ప్రొద్దుటూరుకు వెళ్లే ఆర్డినరీ సర్వీసుల్లో మహిళలు భారీగా తరలివచ్చి ప్రయాణం చేస్తున్నారని ఆర్టీసీ కండక్టర్లు, డ్రైవర్లు తెలిపారు. అందులో భాగంగా జమ్మలమడుగులో పాత బస్టాండు వద్ద ప్రొద్దుటూరు నుంచి వచ్చిన బస్సులో అంద రూ మహిళలే ప్రయాణించారు. ప్రభుత్వం ప్రవేశ పెట్టిన స్త్రీశక్తి పథకం ఆదరణ బాగా ఉందని మహిళలు చెప్పుకోవడం విశేషం. అయితే జిల్లా అధికారులు త్వరగా నాన్‌స్టాప్ సర్వీసులను స్త్రీ శక్తి పథకానికి అనుమతించాలని మహిళలు డిమాండ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆర్టీసీ డిపో మేనేజర్ ప్రవీణ్ మాట్లాడుతూ జమ్మలమడుగు డిపోలో ఉన్న 72 బస్సులకుగాను 36 ఆర్టీసీ బస్సులు, 36 అద్దె బస్సులు ఉన్నాయని, అందులో స్త్రీశక్తి పథకానికి 43 బస్సులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇప్పటి వరకు 13,926 మంది మూడు రోజుల్లో ఆదివారం వరకు మహిళలు ప్రయాణం చేశారని, సోమవారం సైతం అన్ని బస్సుల్లో మహిళలు ఎక్కువగా ప్రయాణం చేశారని తెలిపారు.

యూరియా కొరత రాకుండా చూడండి : ఆర్డీవో



ధర్మాపురం గ్రామంలో రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో సాయిశ్రీ

జమ్మలమడుగు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులకు యూరియా కొరత రాకుండా చూడాలని వ్యవసాయాధికారులను జమ్మలమడుగు ఆర్డీవో సాయిశ్రీ ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జమ్మలమడుగు ఆర్డీవో సాయిశ్రీ ధర్మాపురం గ్రామాన్ని సోమవారం సందర్శించారు. ఈసందర్భంగా గ్రామంలో వరిసాగు చేసిన రైతులు ఆర్డీవో మాట్లాడుతూ తమ గ్రామంలో అత్యధికంగా వరి సాగు చేసినట్లు తెలిపారు. దాదాపు 250 ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారని అ యితే రైతు సేవా కేంద్రాల్లో యూరియా తక్కువగా అందించారని తెలిపారు. ఒక్కొక్క రైతుకు రెండు ప్యాకెట్లు మాత్రమే యూరియా ఇచ్చారని ఆర్డీవోకు తెలిపారు. ప్రస్తుతం జమ్మలమడుగు మండలంలో దాదాపు రెండు వేల ఎకరాల్లో రైతులు వరి పంటను సాగు చేశారని రైతులకు యూరియా కొరత ఇబ్బంది పెడుతోందని వారన్నారు. దీంతో ఆర్డీవో మాట్లాడుతూ యూరియా కొరత లేకుండా రైతులకు అందించాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి శ్రీకాంత్‌రెడ్డి, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

జలమయమైన రోడ్లు.. పరిశీలించిన అధికారులు



ఎస్సీ కాలనీలో పర్యటిస్తున్న కమిషనర్ వెంకటరామిరెడ్డి భూపేశ్‌రెడ్డి

జమ్మలమడుగు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు రోడ్లు జలమయం కావడంతో అధికారులు పరిశీలించారు. మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డిలు కలిసి ప్రధానంగా ఎస్సీ కాలనీ, బీసీ కాలనీల్లో వర్షంతో రోడ్లపై నీరు నిలిచి చిత్తడిగా మారిన. రోడ్లను పరిశీలించారు. ఈ కాలనీల్లో కొత్త రోడ్ల నిర్మాణం కోసం ప్రతిపాదనలు చేసి నిధులు రాగానే పనులు చేపడతామని వారు స్థానికులకు వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

మార్కెట్‌లో ప్రజలకు అసౌకర్యం కలిగిస్తే ఉపేక్షించం



మార్కెట్ వ్యాపారులతో మాట్లాడుతున్న కమిషనర్ రవిచంద్రారెడ్డి

ప్రొద్దుటూరు , ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ తాత్కాలిక కూరగాయల మార్కెట్‌లో ప్రజలకు అసౌకర్యం కలిగించే చర్యలు ఉపేక్షించమని కమిషనర్ రవిచంద్రారెడ్డి వ్యాపారులను హెచ్చరించారు. సోమవారం ఉదయం కమిషనర్ కూరగాయల మార్కెట్‌ను సందర్శించి మార్కెట్ అపరిశుభ్రంగా ఉండడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యాపారులు రోడ్లపై కూరగాయలు పెట్టి ప్రజలకు అసౌకర్యం కలిగించవద్దన్నారు. టౌన్‌ప్లానింగ్ అధికారులు మార్కెట్‌లో ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మార్కెట్‌లోకి వచ్చే వాహనాలు లోపల అడ్డంగా పెట్టి ప్రజలకు ఇబ్బందులు కలిగించడంపై వెంటనే వాటిని మార్కెట్ నుంచి బయటికి పంపాలని ఆదేశించారు. మైదుకూరు రోడ్డు కొశెట్టి హైస్కూలు వద్ద రోడ్డుపై వర్షం నీళ్లు నిలబడ్డంపై పారిశుధ్య కార్మికులతో వాటని తొలగించే పనులు చేపట్టారు. అలాగే కొర్రపాడు రోడ్డు, గోకుల్‌నగర్‌లో రోడ్ల పై ప్రజలు ఇబ్బందులు పడుతుండటంతో ఆ ప్రాంతాల్లో వర్షపునీటిని తొలగించే పనులు చేపట్టారు. డీఈ రాజేష్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ నూర్‌బాషా ఏఈ దస్తగిరి పాల్గొన్నారు.

దివ్యాంగుల పెన్షన్లు తొలగించడం బాధాకరం



ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

బద్వేలు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : రీ వెరిఫికేషన్ పేరుతో దివ్యాంగుల పెన్షన్లు తొలగించాలని చూడడం అన్యాయమని వికలాంగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఇండ్ల ఓబులేసు అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన బద్వేలు ఎంపీడీవోకు వినతి పత్రం అందజేశారు. అర్హత ఉన్న ప్రతి దివ్యాంగుడికి పెన్షన్ అందేలా చూడాలని కోరారు. సర్టిఫికేట్ రీ వెరిఫికేషన్ క్యాంపు ద్వారా ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా లక్ష మందికి పైగా పెన్షన్లు తొలగించారని, అలాగే గోపవరం మండలంలో కూడా 80 మందికి పైగా పెన్షన్లు తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో అంగవైకల్యం గుర్తింపు సర్టిఫికెట్లు ఇచ్చింది వైద్యులే కదా ఇపుడు అవి ఎలా తప్పయ్యాయని ఆయన ప్రశ్నించారు. డబ్బులు ఇచ్చి సర్టిఫికెట్లు పొందిన వారిపై, వారికి సహకరించిన ఉద్యోగులపై చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో జి.బాలరాజు, పట్టణ అధ్యక్షులు రఫీ, గంగన్న, రఫి పాల్గొన్నారు.

నేత్రదానం అభినందనీయం



జ్ఞాపికను అందజేస్తున్న డాక్టర్ గోపాల్

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): నేత్రదానం చేయడం అభినందనీయమని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ గోపాల్ పేర్కొన్నారు. పట్టణానికి చెందిన స్నేహ సేవా సమితి అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి సతీమణి మృతిచెందడంతో పులివెందుల స్నేహిత అమృత హస్తం సేవా సమితి నేత్ర సేకరణ కేంద్రానికి ఆమె నేత్రాలను దానం చేయడం జరిగింది. ఈ సందర్భంగా మధుసూదన్‌రెడ్డికి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ గోపాల్, స్నేహిత అమృత హస్తం అధ్యక్షుడు రాజు చేతుల మీదుగా జ్ఞాపికను అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ నేత్రదానం మరికొందరికి చూపును కొనసాగిస్తుందన్నారు. భార్య నేత్రాలను దానం చేసిన మధుసూదన్‌రెడ్డిని అభినందించారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ, యశ్వంత్ పాల్గొన్నారు.

సమాచార హక్కు సాధన కమిటీ సెక్రటరీగా రాఘవరెడ్డి



కొండాపురం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్టం సాధన కమిటీ జిల్లా సెక్రటరీగా మండలంలోని కె.సుగుమంచిపల్లె గ్రామానికి చెందిన రాఘవరెడ్డి నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం గురించి ప్రజలకు పూర్తి అవగాహన కల్పిస్తానన్నారు. హక్కుల విషయంలో ఎవరికైనా అన్యాయం జరిగితే సమాచార హక్కు చట్టం ద్వారా న్యాయపోరాటం చేస్తానని తెలిపారు. తన నియామకానికి కృషిచేసిన వారికి ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.